నేటి కందం-నేటికి అందం

దారుల నిర్మాణములో
పారిశ్రామికపు వ్యర్థ వస్తుచయంబున్
తీరుగ నుపయోగించగ
భారత నార్వేలు క్రొత్త పథము రచించెన్ !!

(పారిశ్రామిక వ్యర్థాలను రోడ్ల నిర్మాణంలో ఉపయోగించుకునే సాంకేతిక పరిజ్ఞాన పథకానికి భారత నార్వేలు ఒప్పందం చేసుకున్నాయి.)

-రాధశ్రీ
సెల్:9494481210



నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

సోనియాజీ ఆత్మకథ
చేరిపోతే నేడు జనం
కమలానికి ఎందుకింత
కుళ్లు కుత్సితాల గుణం.
చరిత్రకు సున్నమేసి
చూపిందనే ప్రచారం
చేయడమే పవర్ పార్టీ
సంప్రదాయ ఆచారం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 13-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 .Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:88 పేజీలు:69 వెల: రూ.1/-

రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబర్ 12: నగర శివారులోని కొహెడలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కీలక ఆదేశాలు జారీ చేశారు. 2027 మార్చి నాటికి మొదటి దశ పనులు పూర్తి చేయాలని డెడ్‌లైన్ పెట్టిన మంత్రి.. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

కొహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులపై మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు జారీ చేశారు. మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 2027 మార్చి నాటికి మొదటి దశ పనులు పూర్తి చేయాలని డెడ్‌లైన్ పెట్టారు. ఈ క్రమంలో 2028 జూన్ 2 నాటికి పూర్తిస్థాయి మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరిగితే కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకునేలా నిబంధనలను సవరించాలని సూచించారు. నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని మంత్రి స్పష్టం చేశారు. కాగా.. మార్కెట్ నిర్మాణ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక సదుపాయాలతో మార్కెట్‌ను నిర్మించాలని సూచించారు. పండ్ల నిల్వ, విక్రయాలు, దేశీయ, అంతర్జాతీయ రవాణాకు ప్రత్యేక సదుపాయాలు కల్పించే విధంగా నిర్మాణం చేపట్టాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అమితాబ్‌కు మూడోసారి బాంబు బెదిరింపు.. భద్రతా బలగాల అలర్ట్

న్యూ ఢిల్లీ, నవంబర్ 12: బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్‌కు మళ్లీ బాంబు బెదిరింపు వచ్చింది. ఆయనకు ఇలాంటి బెదిరింపు రావడం మూడు వారాల్లో మూడోసారి ఇది. గుర్తుతెలియని వ్యక్తి ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపు పంపాడు. ముంబైలో జుహులోని అమితాబ్ నివాసం జల్సాతో పాటు మేయర్ కార్యాలయం, బ్యాంకు, కోర్టు, మహాలక్ష్మి రేస్‌కోర్స్, ముంబై విమానాశ్రయం కూడా ఈ బెదిరింపుల జాబితాలో ఉన్నాయి. దీంతో భద్రతా బలగాలతో పాటు ముంబై పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్లు ఆ ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. అలాగే ఆ బెదిరింపు ఈమెయిల్ పంపిన వ్యక్తిని ట్రేస్ చేయడానికి సైబర్ ఇన్విస్టిగేటర్లు ప్రయత్నిస్తున్నారు.

కాగా.. గత నెల 23న కూడా ఇలాగే ఒక బాంబు బెదిరింపు వచ్చింది. అమితాబ్ నివాసంతో పాటు బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఒక స్కూల్‌ను లక్ష్యంగా చేసుకుని ఆ మెయిల్ పంపారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27 మధ్య జల్సాపై దాడి జరగవచ్చని బెదిరించారు. దాంతో అమితాబ్ బంగ్లా ప్రాంతంలో భద్రతను పెంచారు. అలాగే, ఈనెల 6న మరో బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. మహాలక్ష్మి రేస్‌కోర్స్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, అమితాబ్ నివాసం ఆ బెదిరింపుల జాబితాలో ఉన్నాయి. తాజాగా మూడోసారి మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీనిపై పోలీసులు, అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి : ఎమ్మెల్యే పద్మావతి



కోదాడ, నవంబర్ 12 : కోదాడ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. గురువారం కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 24 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన ఇల్లు పూర్తి చేసుకునేలా అవసరమైన సహకారం అందిస్తామన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, కౌన్సిలర్ శివ, కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు, అంబటి, కర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు కన్నుమూత

అమరావతి, నవంబర్ 12: టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. విశాఖలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం సాయంత్రం మరణించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మంత్రిగా ప్రజలకు ఆయన సేవలందించారు.1978లో జనతా పార్టీ తరపున నాగూరు ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికైన శత్రుచర్ల 1983,1985లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1989,1991లో పార్వతీపురం ఎంపీగా ,1998లో టీడీపీ ఎంపీగా గెలిచారు . వైఎస్సార్, రోశయ్య మంత్రివర్గంలో ఆయన పనిచేశారు . శత్రుచర్ల మృతి పట్ల పలు పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలు.. హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

హైదరాబాద్, నవంబర్ 12: తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ప్రక్షాళన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. కీలక పోస్టుల్లో కొత్త అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ భగవత్ నియమితులయ్యారు.

ఇప్పటి వరకు హైదరాబాద్ సీపీగా బాధ్యతలు నిర్వహించిన వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డీజీగా బదిలీ చేసింది. అలాగే జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా, మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీగా సౌమ్య మిశ్రాకు బాధ్యతలు అప్పగించింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా చారు సిన్హాను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకేసారి ఇంతమంది కీలక అధికారులకు స్థానచలనం కల్పించడంతో పోలీస్ శాఖలో ఈ బదిలీలు చర్చనీయాంశంగా మారాయి.

ఇక ఇతర కీలక విభాగాల్లోనూ ప్రభుత్వం మార్పులు చేపట్టింది. టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా అనిల్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించగా, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్‌ను నియమించింది. సివిల్ సప్లైస్ కమిషనర్‌గా నాగిరెడ్డికి పోస్టింగ్ ఇచ్చింది. అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఆకున్ సబర్వాల్‌ను నియమించగా, తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విభాగం బాధ్యతలను స్టీఫెన్ రవీంద్రకు అప్పగించింది. మల్టీ జోన్-1 ఐజీగా కార్తికేయను నియమించింది. మరోవైపు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా జోయల్ డేవిస్‌కు అదనపు బాధ్యతలు కేటాయించింది. మొత్తం 21 మంది ఐపీఎస్ అధికారులకు సంబంధించి బదిలీలు, కొత్త పోస్టింగ్స్‌పై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పులతో రాష్ట్ర పోలీస్ యంత్రాంగంలో కీలక విభాగాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే బదిలీ ఉత్తర్వుల్లోని పూర్తి వివరాలు, బాధ్యతల స్వీకరణపై అధికారిక ప్రకటనలను అనుసరించాల్సి ఉంటుంది.

'శామ్ భాయ్'కు మోదీ దీపావళి శుభాకాంక్షలు.. రాజకీయ విభేదాలు మరచి ఆత్మీయత

ఢిల్లీ, నవంబర్ 12: రాజకీయ విమర్శలు, సిద్ధాంతపరమైన విభేదాలతో ఎప్పుడూ భిన్న ధ్రువాలుగా ఉండే ప్రధాని నరేంద్ర మోదీ, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చీఫ్ శామ్ పిట్రోడాల మధ్య దీపావళి పండుగ వేళ ఆసక్తికరమైన, ఆత్మీయ పరిణామం చోటుచేసుకుంది. తన దీర్ఘకాలిక విమర్శకుడైన పిట్రోడాను 'శామ్ భాయ్' అని సంబోధిస్తూ ప్రధాని మోదీ దీపావళి, గుజరాతీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఇవాళ (గురువారం) ప్రధాని మోదీ ఎక్స్ (ట్వీ) వేదికగా స్పందిస్తూ 'శామ్ భాయ్, అంజనా బెన్‌లకు దీపావళి, నూతన సంవత్సర అభినందనలు. రాబోయే ఏడాది అంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను. జై జగన్నాథ్!' అని పోస్ట్ చేశారు. ప్రధాని మోదీని తన 'గుజరాతీ మిత్రుడు' అని పిట్రోడా అభివర్ణించిన కొద్దిసేపటికే ప్రధాని నుంచి ఈ అనూహ్య స్పందన రావడం విశేషం.

అంతకుముందు ఓ వార్తా సంస్థతో మాట్లాడిన శామ్ పిట్రోడా, ప్రధాని మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'ఆయన నా గుజరాతీ మిత్రుడు. ఒక వ్యక్తిగా నేను ఆయనను గౌరవిస్తాను. ఆయన మంచి వక్త, కష్టపడి పనిచేసే తత్వం ఉన్నవారు. వ్యక్తిగతంగా మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు' అని పిట్రోడా అన్నారు. గతంలో తాను, తన భార్య అంజనా గుజరాత్‌లోని మోదీ ఇంటికి చాలాసార్లు వెళ్లామని, ఆ సమయంలో మోదీ ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా ఆతిథ్యం ఇచ్చారని ఆయన గుర్తుచేసుకున్నారు. మోదీతో ఉన్న విభేదాలపై స్పందిస్తూ.. అవి కేవలం రాజకీయ, సిద్ధాంతపరమైనవి మాత్రమేనని, వ్యక్తిగతమైనవి కావని పిట్రోడా స్పష్టం చేశారు. 'మోదీ ప్రపంచ దృక్పథం, ఆయన సిద్ధాంతాలతో నాకు విభేదాలు ఉండొచ్చు. కానీ అది ఆయన ఆలోచనలపై వ్యతిరేకత మాత్రమే, వ్యక్తిపై కాదు. నేను ఆయనతో రాజకీయంగా విభేదిస్తూనే, ఆయనతో కలిసి డిన్నర్ చేయగలను, సరదాగా నవ్వుకోగలను' అని వ్యాఖ్యానించారు.దేశానికి హాని తలపెట్టే విదేశీ శక్తులతో కాంగ్రెస్ చేతులు కలిపిందంటూ బీజేపీ చేస్తున్న విమర్శలను పిట్రోడా తోసిపుచ్చారు. బిలియనీర్ ఇన్వెస్టర్ జార్జ్ సోరోస్‌తో తనకు, రాహుల్ గాంధీకి సంబంధాలు అంటగడుతూ బీజేపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఆయన కొట్టిపారేశారు.

సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన కేటీఆర్



రాజన్న సిరిసిల్ల,నవంబర్ 12: (నేటినిజం ప్రతినిధి): రామగుండం నియోజకవర్గం వేమునూర్ గ్రామ సర్పంచ్ కోల లత కోడలు, కోల మహేష్ లక్ష్మీ దంపతుల కుమార్తె ,సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన అన్ డిఫైనేబుల్ గర్ల్ పుస్తకాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి కోల సింధును గురువారం హైదరాబాదులో కేటీఆర్ వద్దకు తీసుకువెళ్లి ఆమె రచించిన పుస్తకాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

ఈ సందర్భంగా కోల సింధు రచించిన పుస్తకాన్ని అభినందిస్తూ, ఆమె రచనా ప్రతిభను కేటీఆర్ కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ప్రతిష్టాత్మకమైన ఆలిండియా సివిల్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే రచనా రంగంలో ప్రతిభను చాటుతూ, సివిల్స్ లక్ష్యంతో ముందుకు సాగుతున్న కోల సింధు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి , బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

22-ఏ నిషేధిత భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 12: 22-ఎ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో సమావేశమయ్యారు. కాగా.. నిషేధిత భూముల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు పలు సూచనలు చేశారు.

'22-ఎ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి. 22-ఎ దరఖాస్తులన్నీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదు. పరిష్కారంలో జాప్యం చేస్తే సహించేది లేదు. ఈ మేరకు కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు ప్రత్యేక చొరవ చూపాలి. ప్రతి వారం 22-ఎ భూ సమస్యలపై జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించాలి. పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి కమిటీకి పంపాలి. యూఎల్‌సీ సమస్యలపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలి. జీవో 59, 76, 118 అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. దాంతోపాటు.. 22-ఎ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు చర్యలు చేపట్టండి. వాటికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించండి. అర్హులైన భూ యజమానులకు త్వరితగతిన న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలి. అయితే.. ప్రభుత్వ భూముల విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించండి' అని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 12: ఆర్టీసీ సమ్మె సమయంలో ఆత్మహత్యకు పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ఇచ్చిన మాటను.. ప్రభుత్వం నిలబెట్టుకుంది. శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో ఉద్యోగాన్ని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లెటర్‌ను అందచేసింది.


ఆర్టీసీ సమ్మె సమయంలో తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ.. గతంలో నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఒంటిమీద కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్టీసీ సిబ్బంది కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఆనాడే.. తెలంగాణ ప్రభుత్వం మాట ఇచ్చింది. ఈ మేరకు శంకర్ గౌడ్ కుమారుడు.. హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో ఉద్యోగాన్ని కల్పిస్తూ.. ప్రభుత్వం నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన్ను రికార్డ్ ట్రెజర్‌గా నియమిస్తూ నియామక పత్రం అందజేసింది. ఈ నియామక పత్రాన్ని రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తమ చేతుల చేతుల మీదుగా హేమంత్ గౌడ్‌కు అందించారు. అంతేకాకుండా.. శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్టీసీ తరఫున పరిహారాన్ని అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగులు.. తమ ఒక్క రోజు వేతనం కోటి రూపాయలను.. శంకర్ గౌడ్ కుటుంబానికి నష్టపరిహారంగా అందజేశారు.

ఆహ్వానం

అఖిలభారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ మరియు
విశ్వసాహితి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ రచయిత్రి యస్. విజయలక్ష్మి రచించిన
"ఓ ప్రేమ కథ" నవల "ప్రసన్నకు అక్షరాంజలి"
కవితా సంపుటుల ఆవిష్కరణ సభ మరియు
కవిసమ్మేళన కార్యక్రమం



తేదీ : 16-11-2026, సాయంత్రం : 5.00 గం.లకు
వేదిక : అశోక్ నగర్ వెల్ఫేర్ సొసైటీ హాల్, అశోక్‌నగర్, హైదరాబాద్

సభాకార్యక్రమం

సభాధ్యక్షులు : ఆచార్య డా॥ కడారి సత్యమూర్తి గారు, అధ్యక్షులు, ఏ.బి.బి.ఎస్. తెలంగాణ

ముఖ్య అతిథి : ప్రముఖ రచయిత్రి లలిత సంగీత గాయని శ్రీమతి హైమవతి భీమన్న గారు, అధ్యక్షులు, మహాకవి భోయ భీమన్న కళాపీఠం

విశిష్ట అతిథులు : శ్రీ బైస దేవదాసు గారు, సంపాదకులు "నేటినిజం" దినపత్రిక; ఆచార్య త్రిమూర్తుల గౌరి శంకర్ గారు, పూర్వ రిజిస్ట్రారు, తెలుగు విశ్వవిద్యాలయం

ఆత్మీయ అతిథులు : డా॥ పులిపర్తి కృష్ణమూర్తి గారు, అధ్యక్షులు, విశ్వసాహితీ తెలంగాణ; శ్రీ పాత్తూరి సుబ్బారావు గారు, సంపాదకులు, "సాహితీకిరణం" మాస పత్రిక

పుస్తక సమీక్ష : శ్రీమతి గోళ్ళమూడి పద్మావతి గారు, ప్రధాన కార్యదర్శి, విశ్వసాహితి తెలంగాణ

సభాసమన్వయం : ఎన్వీ. రఘువీర్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి, ఏ.బి.బి.ఎస్. తెలంగాణ

ప్రముఖ కవులచే కవి సమ్మేళనం
అందరూ ఆహ్వానితులే

నిర్వహణ :
అఖిలభారతీయ భాషా సాహిత్య సమ్మేళన్
విశ్వసాహితీ సంస్థలు, హైదరాబాద్

చిన్న చిన్న సత్కార్యాలతో గొప్ప ప్రభావం

(13 నవంబర్ "ప్రపంచ దయ దినోత్సవం" సందర్భంగా)

మానవీయ గుణాల్లో దయ, కరుణ, క్షమాగుణం లాంటివి అతి ప్రధానమైనవి. దయ చూపడం ఓ సుగుణం అని అర్థం చేసుకోవాలి. దయను పంచడం ఓ అలవాటు కాలాలి. దయకలిగిన వారిలో దైవత్వం ఉట్టిపడుతుంది. దయాగుణం కలిగిన మానవ సమాజం ప్రశాంత వాతావరణంలో సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. దయ పంచని వారు కఠినాత్ములుగా పరిగణించబడతారు. ఇలాంటి అతి ముఖ్యమైన మానవీయ దయాగుణం ప్రాధాన్యాన్ని ప్రపంచ మానవాళికి గుర్తు చేయడానికి, దాని శక్తిని అవగాహన పర్చడానికి 1998 నుంచి ప్రతి ఏట 13 నవంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "ప్రపంచ దయ దినోత్సవం(వరల్డ్ కైండ్‌నెస్ డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. మన దైనందిన జీవితాల్లో దయాగుణానికి పెద్ద పీట వేయబడింది. సున్నిత మనస్కుల్లో దయాగుణం ఒక శాశ్వత సుందర ఆభరణంగా నిలుస్తుందని ప్రజలకు తెలియపర్చడం, సహానుభూతిని అలవాటు చేసుకోవడం, అర్థవంతంగా జీవితాన్ని గడపడం, సమన్వయ భావనతో ఇరుగుపొరుగుకు చేయూతనివ్వడం లాంటివి దయామయులకు మాత్రమే సాధ్యమవుతాయి.

దయగల హృదయంతో పౌర సమాజ వెలుగులను చూద్దాం :

ప్రపంచ దయా దినోత్సవం -2026 ఇతివృత్తంగా "చిన్న చిన్న కార్యాలతో గొప్ప ప్రభావం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. దయగల వ్యక్తులు ఉదారంగా, ప్రేమగా, సదుద్దేశ్యంతో ఉంటారు. అసంకల్పితంగా పరులకు సహాయం చేయడం, నిస్వార్థంగా అవసరార్థులకు సేవలు అందించడం, సత్కార్యాలకు పూనుకోవడం లాంటి సద్గుణాలు దయామయుడిలో కనిపిస్తాయి. దయగల వ్యక్తులు ఇతరుల జీవితాల్లో నవ్వుల వెలుగులను చూడడానికి ఉత్సాహపడతారు. దయగల మహానుభావులు సమాజంలో ఆదర్శవంతులుగా లేదా రోల్ మోడల్‌గా నిలబడతారు. దయామయులు చరిత్రలో చెరగని ముద్రను వేస్తారు. దయగల వ్యక్తుల్లో నైతికత, నీతి, నిజాయితీ, సేవాతత్పరత, నిబద్ధత, ప్రేమాభిమానాలు, విలువలతో కూడిన జీవన విధానాలు విధిగా కనిపిస్తాయి. దయగల వారు చీమకు కూడా హానిని తలపెట్టరు. "సకల జీవుల సేవయే మాధవ సేవ" అని పూర్తిగా నమ్ముతారు.

సహానుభూతి శాశ్వత ఆభరణం కావాలి :

దయగల వ్యక్తులు ఇతరులకు స్వచ్ఛందంగా సహాయం చేయగల మహత్తర శక్తి ఉంటుంది. దాతృత్వం, సహృదయత, విచక్షణ, మానవీయత, సహానుభూతి గుణాలు కలిగిన వ్యక్తులను దయామయుడిగా పరిగణిస్తారు.

"మొక్కై వంగనిదే మానై వంగునా" అన్నట్లు చిన్నతనం నుంచే పిల్లల్లో దయాగుణాన్ని బోధించడం తల్లితండ్రుల బాధ్యతగా గుర్తించాలి. దయలేని ప్రపంచం నరకప్రాయమని అర్థం చేయించాలి. ప్రపంచ దయ దినోత్సవం వేదికగా దయా గుణాన్ని పిల్లల్లో అలవాటు చేయడం, బడి పిల్లల చేత ఇతరులకు సేవ అందించడాన్ని అలవాటు చేయడం, చిన్నారుల చేతుల మీదుగా పేదలకు సహాయం చేయించడం, వారి పుట్టిన రోజులను పేదల పిల్లల మధ్య జరుపుకోవడం, దయ గుణం ప్రాధాన్యాన్ని వివరించడం, దానధర్మాలు చేయడం, నిస్సహాయులకు చేయూత అందించడం, దయగల వ్యక్తులను సన్మానించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

దయగల ప్రపంచం స్వర్గతుల్యం. దయలేని మనిషిలో రాక్షసత్వం బయట పడుతుంది. దయాగుణంతో ప్రజల మనసులను గెలవవచ్చు. దయను ప్రదర్శించడానికి ప్రత్యేక సందర్భాలంటూ కొన్ని ఉన్నప్పటికీ, అనుక్షణం దయను చూపడం ఓ మంచి అలవాటుగా కలిగి ఉండాలి. అనాధాశ్రమ వాసులకు సహాయం చేయడం, అవసరార్థులకు తగు చేయూతనివ్వడం మన కనీస కర్తవ్యంగా భావించి దయాగుణాన్ని నరనరాల్లో నింపుకుందాం, దయ అనే వృక్షం నీడన జీవించడం అలవాటు చేసు కుందాం.



-మధుపాళీ
9949700037

100 వారాల మాదకద్రవ్య వ్యతిరేక ప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా దీపోత్సవం, స్థానిక యువజన పార్లమెంట్లను నిర్వహించిన మై భారత్



న్యూ ఢిల్లీ, నవంబర్ 12: లను మాదకద్రవ్యాల దుర్వినియోగం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని మేరా యువ భారత్ (మై భారత్) దేశవ్యాప్తంగా 'నషా ముక్త్ యువ పర్ పరిచర్చ' కార్యక్రమాలను నిర్వహించింది. 100 వారాల 'వికసిత్ భారత్ కోసం మాదకద్రవ్య రహిత యువత' సంకల్ప అభియాన్‌లో భాగంగా 8వ వారంలో2026 నవంబర్ 6, 7 తేదీల్లో ఈ అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాలు దీపావళి వేడుక రంగవల్లులు వేయడం, దీపాలు వెలిగించడం, మిఠాయిల పంపిణీ, అవగాహన కార్యక్రమాలు, మై భారత్ వాలంటీర్లకు సన్మానం వంటివి నిర్వహించారు. బ్రహ్మకుమారీస్, ఈపీఎస్ఐ, హార్ట్‌ఫుల్‌నెస్ సహా భాగస్వామ్య సంస్థలు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో వాలంటీర్లతో కలిసి దీపావళి సందర్భంగా మై భారత్ వేడుకలు నిర్వహించింది. బండాలోని వృద్ధాశ్రమంలో మిఠాయిలు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు రాంపూర్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఛత్తీస్‌గఢ్‌లో ముంగేలి, ధంతరిలో దీపోత్సవం, రంగవల్లుల కార్యక్రమాలు నిర్వహించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రాలోని వృద్ధాశ్రమంలో వేడుకలు, మిఠాయిల పంపిణీ చేపట్టారు. మహారాష్ట్రలోని యవత్మాల్, పుదుచ్చేరిలోని యానాం, జమ్మూ కశ్మీర్‌లోనూ ఇలాంటి వేడుకలే నిర్వహించారు.

మండల స్థాయిలో స్థానిక యువ సభల (ఎన్‌వైపీలు) ద్వారా నిర్వహించిన 'నషా ముక్త్ యువ పర్ పరిచర్చ' సదస్సులో 85 కార్యక్రమాలు, 298 కార్యకలాపాలు చేపట్టారు. వీటిలో 9,526 మంది పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, దాని వల్ల ఎదురయ్యే సవాళ్లు, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్రపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి.

ప్రతి మండలంలో కనీసం 80 మంది యువతను భాగస్వాములను చేసేలా, నాలుగు క్రమబద్ధమైన సమావేశాలతో ప్రతి ఎన్‌వైపీని రూపొందించారు. వీటిలో మై భారత్ వేదికపై అవగాహన కల్పించడం, 'మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అర్థం చేసుకోవడం: భారత యువత ముందున్న సవాళ్లు', 'అవగాహన నుంచి కార్యాచరణ వరకు: మాదకద్రవ్య రహిత యువత కోసం సాధనాలు', 'మార్పు కథలు: మాదకద్రవ్య రహిత భారత్ దిశగా ప్రయాణం' అనే ఆడియో-విజువల్ ప్రదర్శనలు ఉన్నాయి.

ఈ చర్చల్లో నినాదాల రచన, రంగవల్లుల రూపకల్పన, వీధి నాటకాలు, వరస్పర చర్చా కార్యక్రమాలు, ప్రతిజ్ఞలు చేయడం వంటి కార్యకలాపాలు కూడా నిర్వహించారు. హర్యానాలోని భివానీ, మహేంద్రగఢ్ జిల్లా భూనా, మహారాష్ట్రలోని లాతూర్, తూర్పు ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్‌లోని డోంగర్‌గఢ్‌లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారు. మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణం దిశగా యువత నిరంతర భాగస్వామ్యానికి, సమాజ ఆధ్వర్యంలోని కార్యాచరణకు 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువత' 100 వారాల సంకల్ప అభియాన్' దేశవ్యాప్త వేదికను అందిస్తోంది.

సోనియాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా తెలుగులో సినిమా తీస్తాం - జగ్గారెడ్డి

సంగారెడ్డి నవంబరు 12 (నేటి నిజం ప్రతినిధి) సోనియా గాంధీ స్వయంగా రచించిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఆధారంగా ఆమె జీవిత చరిత్రను తెలుగులో సినిమాగా తెరకెక్కిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రకటించారు. సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సినిమాకు సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలుగా వ్యవహరించాలని సూచించారు. సినిమా నిర్మాణం కోసం 50 మందితో కమిటీ ఏర్పాటు చేసి, గాంధీభవన్ పీఆర్వో హరిప్రసాద్ పర్యవేక్షణలో బడ్జెట్ సమీకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ జులకంటి ఆంజనేయులు రూ.2 కోట్లు అందించేందుకు ముందుకొచ్చారు. మంచి దర్శకుడిని ఎంపిక చేసి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా చిత్రీకరణ ప్రారంభిస్తామని జగ్గారెడ్డి వెల్లడించారు.

సోనియాగాంధీ కుటుంబ జీవితం, ఇందిరాగాంధీ కోడలిగా, రాజీవ్‌గాంధీ భార్యగా ఆమె ఎదుర్కొన్న పరిస్థితులు, ఇందిరా, రాజీవ్‌గాంధీల హత్యల అనంతరం కుటుంబం ఎదుర్కొన్న విషాదం, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలను పెంచిన తీరు, ఆమె రాజకీయ ప్రస్థానం వంటి అంశాలను సినిమాలో చూపిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సోనియాగాంధీ, దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. ప్రధాని అయ్యే అవకాశం ఉన్నప్పటికీ ఆ పదవిని స్వీకరించకుండా మన్మోహన్‌సింగ్‌కు అవకాశం కల్పించడం ఆమె రాజకీయ జీవితంలో చరిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్‌గాంధీల ఆలోచనల ఫలితంగానే ఉపాధి హామీ పథకం రూపుదిద్దుకుందని అన్నారు. రాహుల్‌గాంధీ దేశానికి ప్రధాన మంత్రి కావాల నేది సోనియా గాంధీ ఆకాంక్ష అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. సోనియాగాంధీ జీవితాన్ని కార్యకర్తలకు మరింత చేరువ చేసేందుకు ఆమె రచించిన పుస్తక ప్రతులను తెప్పించి పంపిణీ చేస్తామని తెలిపారు.

కొమురం భీమ్ మనుమడు మృతి బాధాకరం

భీమ్రావు కుటుంబానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శ



లజ్జెనూర్, నవంబర్ 12: రోడ్డు ప్రమాదంలో గాయపడి కొమురం భీమ్ రెండో మనుమడు కుమ్ర భీమ్రావు మృతి చెందడం బాధాకరమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం భీమ్రావు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె గురువారం కొమురం భీమ్ జిల్లా సిర్పూర్ మండలం పెద్దదోబ గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లారు.

భీమ్రావు చిత్రపటానికి సంప్రదాయ పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ప్రమాదానికి గల కారణాలను ఆయన అన్న, కొమురం భీమ్ పెద్ద మనుమడు కుమ్ర సోనేరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కార్యక్రమంలో సిర్పూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తొడసం ధర్మారావు, సర్పంచులు ఆత్రం ఓం ప్రకాష్, పెందూర్ మాధవరావు, నీట్నూర్ మాజీ సర్పంచ్ అర్క నాగోరావు తదితరులు పాల్గొన్నారు

'నషా ముక్త్ యువ, వికసిత్ భారత్ క్విజ్'లో పాల్గొన్న 25,607 మంది పౌరులు

న్యూఢిల్లీ, నవంబర్ 11: ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ యువ, వికసిత్ భారత్ క్విజ్'కు మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 10 నాటికి ఇందులో పాల్గొన్న వారి సంఖ్య 25,600 దాటింది.

మాదకద్రవ్య రహిత భారతావనిని నిర్మించే ఉమ్మడి లక్ష్యం పట్ల ప్రజల్లో... ముఖ్యంగా యువతలో పెరుగుతున్న ఆసక్తిని పెరుగుతున్న ఈ భాగస్వామ్యం ప్రతిబింబిస్తోంది.

'నషా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎమ్‌బీఏ)లో భాగంగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఈ క్విజ్‌ను అక్టోబర్ 26, 2026న ప్రారంభించింది.

మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికర మైన ప్రభావాల గురించి అవగా హన కల్పించడం, 'నషా ముక్త్ భారత్'ను నిర్మించే దిశగా పౌరు లను, ముఖ్యంగా యువతను చు రుగ్గా ఈ కార్యక్రమంలో భాగ స్వాములను చేయడం దీని ముఖ్య ఉద్దేశం.

ఈ క్విజ్ 2026, అక్టోబర్ 26 నుంచి నవంబర్ 25 వరకు నిర్వహించబడుతోందని, ఇందులో పౌరులంతా పాల్గొనవచ్చని మంత్రిత్వ శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారి తెలిపారు.

ఆసక్తి గల అభ్యర్థులు 'మై భారత్' పోర్టల్ ద్వారా క్విజ్‌లో పాల్గొనవచ్చనీ... తద్వారా ఈ దేశవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చని ఆయన పేర్కొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం 2020, ఆగస్టు 15న ప్రారంభమైంది.

నివారణాత్మక విద్య, అవగాహన కల్పన, చికిత్స, పునరావాసం, సమాజ భాగస్వామ్యం ద్వారా మాదకద్రవ్యాల డిమాండ్‌ను తగ్గించే ప్రయత్నాలను బలోపేతం చేయడం ఈ కార్య క్రమ లక్ష్యం అని మంత్రిత్వశాఖకు చెందిన అధికారి వివరించారు.

మొదట 272 వెనకబడిన జిల్లాల్లో మొదలైన ఈ కార్యక్రమం... ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలకు విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

ఈ ప్రచారం 35.84 కోట్ల మందికి పైగా ప్రజలకు చేరువయ్యిందనీ... ఇందులో 14.33 కోట్ల మంది యువత, 11.32 కోట్ల మంది మహిళలూ ఉన్నారని ఆ అధికారి పేర్కొన్నారు. ఇది ఈ అవగాహన, విస్తరణ కార్యక్రమాల దేశవ్యాప్త పరిధిని ప్రతిబింబిస్తుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థల్లో 33.57 లక్షలకు పైగా కార్యక్రమాలు నిర్వహించారు.

సామాజిక న్యాయం, సాధికారత శాఖ మద్దతుతో దేశవ్యాప్తంగా వనిచేస్తున్న 755కు పైగా వ్యసన విముక్తి కేంద్రాల ద్వారా 39.91 లక్షల మందికి చికిత్స, పునరావాసం కల్పించారు.

'నషా ముక్త్' కోసం తీసుకున్న ప్రతిజ్ఞల సంఖ్య 46. 73 లక్షలు దాటిందనీ, 2 లక్షల మందికి పైగా 'నషా ముక్తి మిత్ర' లుగా నమోదు చేసుకు న్నారని మంత్రిత్వశాఖ అధికారి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం విజయవంతంగా ఏడో సంవత్సరంలోకి అడుగుపెట్టిందని మంత్రిత్వశాఖ అధికారి తెలిపారు.

మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దు ష్ప్రభావాలపై ప్రజలకు అవగా హన కల్పించడం, సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడాన్ని ప్రోత్సహించడం, యువతను చైతన్యం చేయడం, నివారణ కోసం క్రియాశీల రాయబా రులుగా మారేలా యువతను ప్రోత్సహించడం ఈ క్విజ్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

దేశాభివృద్ధిలో ఆరోగ్యకరమైన వ్యక్తులు, కుటుంబాలు, సమాజాల ప్రాముఖ్యతను గుర్తిస్తూ... ఈ కార్యక్రమం 'నషా ముక్త్ భారత్', 'వికసిత్ భారత్' దార్శనికతలను మరింత బలోపేతం చేస్తుందని ఆ అధికారి తెలిపారు.

ఈ క్విజ్‌లో 20 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయనీ, దీనిలో పాల్గొనేవారు వీటిని 10 నిమిషాల్లోపు పూర్తి చేయాల్సి ఉంటుందని సదరు అధికారి వివరించారు.

క్విజ్‌ను విజయవంతంగా పూర్తి చేసి, సమర్పించిన ప్రతి అభ్యర్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్విజ్ పూర్తి చేసిన అభ్యర్థులు తర్వాత సరైన సమాధానాలను చూసుకోవచ్చని... తద్వారా మాదకద్రవ్యాల వినియోగ నివారణ పట్ల తమ అవగాహనను మెరుగుపరుచుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈ డిజిటల్ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ... సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, బాధ్యతాయుతమైన ఎంపికలను ప్రోత్సహించడం, మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా సాగే ఉద్యమానికి పౌరులను, ముఖ్యంగా యువ తను సమీకరించి, వారి సహకా రాన్ని పొందడం మంత్రిత్వ శాఖ లక్ష్యమని ఆ అధికారి తెలిపారు.

'నషా ముక్త్ యువ, వికసిత్ భారత్ క్విజ్'లో పాల్గొనాలనుకునే వారికి ఈ నెల 25 వరకు అవకాశం కల్పించామన్నారు

పునరావాసం కల్పించాకే ఇళ్లు ఖాళీ చేస్తాం!

చెరువు సుందరీకరణతో 122 కుటుంబాల్లో ఆందోళన.. అధికారులకు బాధితుల విజ్ఞప్తి



ఆదిలాబాద్, నవంబర్ 12:ఆదిలాబాద్ పట్టణంలోని నిజాం కాలం నాటి చెరువు సుందరీకరణ పనులు స్థానికుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి.

చెరువు పరిసరాల్లోని ఖానాపూర్, కొలిపుర కాలనీలకు చెందిన ఇళ్లను ఖాళీ చేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేయడంతో బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సుమారు 122 ఇళ్ల యజమానులకు నోటీసులు అందినట్లు సమాచారం.

దశాబ్దాలుగా అక్కడే నివాసం ఉంటున్న తమకు ముందుగా పట్టణ శివారులో ఇంటి స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. పునరావాసం కల్పించిన తర్వాతే ఇళ్లు ఖాళీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

బాధితులకు కాంగ్రెస్ నేతల భరోసా..

గురువారం డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, కాంగ్రెస్ నాయకులు సాజిద్ ఖాన్, గంద్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి తదితరులు కాలనీలను సందర్శించి బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు అన్యాయం జరగకుండా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని నరేష్ జాదవ్ హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ నేతలు అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌ను కలిసి నిర్వాసితుల సమస్యలను వివరించారు. జిల్లా కలెక్టర్‌తో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

వయో సమ్మాన్ రాష్ట్రీయ అభియాన్‌లో 'వయో సాథీ వాలంటీర్లు'గా నమోదు చేసుకోవాల్సిందిగా పౌరులకు పిలుపు

న్యూ ఢిల్లీ, నవంబర్ 12: పద్దెనిమిది ఏళ్ల వయస్సు వారు, అంతకు మించిన వయోజనులను వయో సాథీ (ఎజీఎనీ ాంయిఱఎ) కార్యక్రమంలో భాగంగా స్వయంసేవకులుగా నమోదు చేసుకోవాల్సిందిగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కోరింది. ఈ కార్యక్రమం.. ఇటీవల మొదలుపెట్టిన 'వయో సమ్మాన్ రాష్ట్రీయ అభియాన్'లో ఓ ముఖ్య భాగం. ఇది 'అటల్ వయో అభ్యుదయ్ యోజన' (ఏవీవైఏవై)లో భాగంగా చేపట్టిన కార్యక్రమం. భిన్న తరాలకు చెందిన వారి మధ్య సహృదయ సంబంధాల్ని పటిష్టపరచడం ఈ కార్యక్రమ లక్ష్యం.

సీనియర్ సిటిజన్ల సంక్షేమం, ఆత్మగౌరవ పరిరక్షణతో పాటు వారిని సమాజ ప్రవంతిలోకి తీసుకువచ్చేందుకు పౌరులు, విద్యార్థులు, యువ వృత్తినిపుణులు, సమాజంలోని స్వచ్ఛంద సేవకులు తమ తోడ్పాటును అందించేందుకు ఒక అవకాశాన్ని ఈ కార్యక్రమం అందిస్తోంది.

యమునా వినోదాత్మక క్రూయిజ్ సేవల ప్రారంభంతో ఢిల్లీలో నదీ పర్యాటకానికి శ్రీకారం



న్యూ ఢిల్లీ, నవంబర్ 12: ఢిల్లీలో నదీ పర్యాటకాన్ని విస్తరించే దిశగా కీలక ముందడుగు వడింది. యమునా నదిపై తొలిసారిగా ఏర్పాటు చేసిన వినోదాత్మక క్రూయిజ్ సేవలను ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా సమక్షంలో కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాలశాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ నేడు ఇక్కడి సోనియా విహార్‌లో ప్రారంభించారు.

సోనియా విహార్-జగత్‌పూర్ మార్గంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. యమునా నదిలోని పర్యాటక, వినోద అవకాశాలను అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు, రాజధాని వాసులు, సందర్శకులకు ఢిల్లీని మరో కొత్త కోణంలో ఆస్వాదించే అవకాశాన్ని కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం. పర్యాటకం, ప్రయాణికుల రవాణా, ఆర్థిక కార్యకలాపాలకు భారత నదులను కీలక వేదికలుగా అభివృద్ధి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాల్లో ఇది మరో మైలురాయి.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ సహాయ మంత్రి శాంతను ఠాకూర్, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా, ఢిల్లీ ప్రజా పనుల శాఖ, నీటిపారుదల, వరద నియంత్రణ శాఖ మంత్రి ప్రవేశ్ సాహిబ్ సింగ్, పర్యాటక శాఖ మంత్రి కపిల్ మిశ్రా, అటవీ, పర్యావరణం, పరిశ్రమల శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా, ఎంపీ మనోజ్ తివారీ పాల్గొన్నారు. కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ కార్యదర్శి విజయ్ కుమార్, ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) చైర్మన్ సుశీల్ కుమార్ లోహానీతో పాటు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్‌లోని విస్తారమైన అంతర్గత జలమార్గాల సామర్థ్యాన్ని వినియోగించుకోవాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ ప్రాజెక్టు నిదర్శనమని పేర్కొన్నారు.

"ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత నదులు, అంతర్గత జలమార్గాలు ఆర్థిక వృద్ధి, పర్యాటకం, సుస్థిర రవాణాకు కీలక చోదకశక్తులుగా రూపుదిద్దుకుంటున్నాయి. యమునా నదిపై ఢిల్లీలో తొలి వినోదాత్మక క్రూయిజ్ సేవల ప్రారంభం.. ప్రజలకు, నదులకు మధ్య అనుబంధాన్ని పునరుద్ధరించడంతో పాటు వాటిలోని అపారమైన సామర్థ్యాన్ని వినియోగించుకునే దిశగా మరో ముందడుగు. ఈ ప్రారంభం నగరంలో నదీ పర్యాటకానికి కొత్త ఊపునిస్తుంది. పరిశుభ్రమైన, సమర్థవంతమైన రవాణా వ్యవస్థకు కట్టుబడి ఉంటూనే, జలమార్గాలను పర్యాటకం, వాణిజ్యం, జీవనోపాధికి వేదికలుగా మారుస్తున్నాం. వికసిత్ భారత్ నిర్మాణానికి సంబంధించిన మా దార్శనికతలో ఇది కీలక భాగం" అని సర్బానంద సోనోవాల్ అన్నారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా 30 మంది ప్రయాణించే సామర్థ్యం కలిగిన విద్యుత్ క్రూయిజ్ నౌకను అందుబాటులోకి తీసుకొచ్చారు. నదిలో సుమారు ఆరు కిలోమీటర్ల దూరం రానుపోను ప్రయాణిస్తూ సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించనుంది. విద్యుత్‌తో నడిచే నౌకల వినియోగం ద్వారా పరిశుభ్రమైన, నుస్థిర రవాణా సాధనంగా అంతర్గత జలమార్గాల సామర్థ్యాన్ని ఈ ప్రాజెక్టు చాటిచెబుతోంది.

ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఢిల్లీ పర్యాటక రంగానికి కొత్త కోణాన్ని అందించడంతోపాటు, యమునా నదితో ప్రజల అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

"యమునా నది ఢిల్లీ చరిత్ర, సంస్కృతి, గుర్తింపులో అంతర్భాగం. ఈ వినోదాత్మక క్రూయిజ్ సేవలు స్థానిక ప్రజలకు, సందర్శకులకు నదిని కొత్తగా ఆస్వాదించే అవకాశాన్ని కల్పించడంతోపాటు, పర్యాటకం, స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చైతన్యవంతమైన నాయకత్వంలో మెరుగైన సౌకర్యాలు, సుస్థిర మౌలిక నదుపాయాలు, నగర వారసత్వాన్ని చాటిచెప్పే అనుభవాలతో ఢిల్లీ నదీ తీర ప్రాంతాన్ని ఆకర్షణీయమైన ప్రజా సందర్శక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మేం కట్టుబడి ఉన్నాం" అని రేఖా గుప్తా తెలిపారు.

విస్తృతమైన పర్యావరణహిత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యమునా ప్రాజెక్టులో పలు వినోద ఆకర్షణలు, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రధాన ఆకర్షణగా సంగీతానికి అనుగుణంగా కాంతులు, శబ్దాలతో కూడిన ప్రదర్శనను నిర్వహించే మ్యూజికల్ ఫౌంటెన్ ఉంది. ఈ ప్రదర్శనలో యమునా నది చరిత్ర, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను తెలియజేస్తారు. సూర్యదేవుడు, యమధర్మరాజుతో యమునాకు ఉన్న అనుబంధంతోపాటు, శ్రీకృష్ణుడి దివ్య లీలలు, ముఖ్యంగా ప్రసిద్ధి చెందిన కాళీయమర్దనం ఘట్టాన్ని ప్రదర్శిస్తారు.

ఈ పర్యాటక కేంద్రంలో ఫుడ్ కోర్టు, షాపింగ్ ప్రాంతం, పిల్లల ఆట స్థలం, స్కేటింగ్, రాక్ క్లైంబింగ్ వంటి సాహస క్రీడల సదుపాయాలను కూడా ఏర్పాటు చేశారు. సందర్శకులకు సౌకర్యవంతమైన అనుభూతిని కల్పించేందుకు ఆధునిక తేలియాడే జెట్టీలు, ప్రత్యేక టికెట్ కౌంటర్లు, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సదుపాయం, మరుగుదొడ్లు, వేచిఉండే గదులు, విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రవేశ మార్గాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

జాతీయ జలమార్గాల చట్టం 2016 ప్రకారం యమునా నదిని జాతీయ జలమార్గం?110గా ప్రకటించారు. జాతీయ రాజధానిలో వినోదాత్మక నౌకాయానం, నదీ ఆధారిత పర్యాటక అభివృద్ధికి ఈ క్రూయిజ్ సేవల ప్రారంభం కీలక పరిణామం.

భారతీయ అంతర్గత జలమార్గాల్లో చోటుచేసుకుంటున్న విస్తృత పరివర్తనలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ జలమార్గాలపై సరకు రవాణా 2013?14లో 1.8 కోట్ల మెట్రిక్ టన్నుల నుంచి 2025-26 నాటికి 21.8 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది. దేశ రవాణా, సరఫరా వ్యవస్థలో జలమార్గాల ప్రాధాన్యం పెరుగుతోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జలమార్గాల ద్వారా ఒక టన్ను సరుకును ఒక కిలోమీటరు దూరం తరలించేందుకు సుమారు రూ.1.06 ఖర్చవుతుండగా, రైలు మార్గంలో రూ.1.41, రోడ్డు మార్గంలో రూ.2.28 వ్యయమవుతోంది. దీంతో సరకు రవాణాకు అంతర్గత జలమార్గాలు తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి.

ఈ విస్తరణలో నదీ క్రూయిజ్ పర్యాటకం మరో అభివృద్ధి చెందుతున్న విభాగం. రాత్రిపూట ప్రయాణ సదుపాయం కల్పించే నదీ క్రూయిజ్ నౌకల సంఖ్య 2013?14లో అయిదు ఉండగా, 2025?26 నాటికి 26కు పెరిగింది. ఎంవీ గంగా విలాస్ చేపట్టిన చారిత్రక ప్రయాణం ఈ రంగంలో మైలురాయిగా నిలిచింది. ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘమైన నదీ క్రూయిజ్ ప్రయాణంగా ఈ యాత్ర లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తింపు పొందింది. భారత్, బంగ్లాదేశ్ మీదుగా 3,200 కిలోమీటర్లకు పైగా సాగిన ఈ ప్రయాణం 50 పర్యాటక ప్రాంతాలను అనుసంధానించింది. రెండు దేశాలు, అయిదు రాష్ట్రాలు, 27 నదీ వ్యవస్థల మీదుగా ఈ యాత్ర కొనసాగింది.కేంద్ర ఓడరేవులు, నౌకా యాన, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) ఈ వినోదా త్మక యమునా నదీ క్రూయిజ్ సేవలను అభివృద్ధి చేసింది. ఢిల్లీ అభివృద్ధి ప్రాధికార సంస్థ, ఢిల్లీ పర్యాటక, రవాణా అభివృద్ధి సంస్థ, ఢిల్లీ జల్ బోర్డు, ఢిల్లీ ప్రభుత్వ నీటిపారుదల, వరద నియంత్రణ శాఖల సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు.

దేశవ్యాప్తంగా అందుబాటులోకి వస్తోన్న ప్రత్యేక తృతీయ వైద్య సేవలు:

2021-22 నుంచి కొత్త ఎయిమ్స్ ఆసుపత్రులలో 6 కోట్లు దాటిన ఓపీడీ కన్సల్టేషన్‌లు

న్యూ ఢిల్లీ, నవంబర్ 12: ప్రధానమంత్రి స్వస్థ సురక్ష యోజన (పీఎంఎస్ఎస్వై) కింద 2021-22లో ప్రారంభమైన కొత్త అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) ఆసుపత్రులు సంయుక్తంగా ఐదేళ్ల కాలంలోనే (31 అక్టోబర్ 2026 నాటికి) 6 కోట్లకు పైగా ఓపీడీ(అవుట్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్) కన్సల్టేషన్‌లను నమోదు చేశాయి. ఈ ఘనత సదరు సంస్థల విస్తృత సేవలకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ప్రత్యేక తృతీయ వైద్య సంరక్షణ సేవలను చేరువ చేయడంలో అవి పోషిస్తోన్న పాత్రను తెలియజేస్తోంది.

అందుబాటు ధరల్లో విశ్వసనీయమైన తృతీయ వైద్య సేవలు లభించే విషయంలో ఉన్న ప్రాంతీయ అసమతుల్యతలను తొలగించడానికి భారత ప్రభుత్వం పీఎంఎస్ఎస్వై కింద ఎయిమ్స్ నెట్‌వర్క్‌ను నిరంతరం విస్తరిస్తోంది. ఈ వినూత్న కార్యక్రమం ప్రత్యేక వైద్య సేవల విస్తరణతో పాటు దేశంలోని వైద్య విద్య, పరిశోధనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కూడా కృషి చేస్తోంది.

వివిధ దశల్లో పీఎంఎస్ఎస్వై కింద ఆమోదించిన 22 కొత్త ఎయిమ్స్ ఆసుపత్రులలో 18 సంస్థలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. ఈ సంస్థలు అవుట్‌పేషెంట్ (ఓపీడీ), ఇన్‌పేషెంట్ (ఐపీడీ) సంరక్షణ.. అత్యవసర-ట్రామా సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య విద్య- పరిశోధనలతో సహా విస్తృత శ్రేణి సేవలను అందిస్తున్నాయి.

ఈ సంస్థల సేవలకు పెరుగుతున్న ఆదరణ, వినియోగం ప్రతి సంవత్సరం నమోదు అవుతున్న ఓపీడీ గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఓపీడీ కన్సల్టేషన్‌లు 2021-22లో 50.03 లక్షలుగా ఉండేవి. అవి 2022-23 నాటికి 77.95 లక్షలకు, 2023-24 నాటికి 100.52 లక్షలకు పెరిగాయి. ఆ తర్వాత 2024-25లో 129.98 లక్షలకు, 2025-26 నాటికి 144.96 లక్షలకు చేరుకున్నాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో అక్టోబర్ నాటికి కొత్త ఎయిమ్స్ ఆసుపత్రులు 97.41 లక్షల ఓపీడీ కన్సల్టేషన్‌లను నమోదు చేశాయి. ఈ సంవత్సరాలన్నింటిలో ఓపీడీ కన్సల్టేషన్‌లు దాదాపు 6.01 కోట్లకు చేరాయి.

నాణ్యమైన బొగ్గు సరఫరానే సింగరేణి లక్ష్యం

సింగరేణి బొగ్గు కోసం పోటీపడుతున్న పరిశ్రమలు..
రామగుండం ఏరియా జీఎం లలిత్‌కుమార్



కరీంనగర్, సెప్టెంబర్ 19: వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడమే సింగరేణి ప్రధాన లక్ష్యమని రామగుండం ఏరియా జీఎం డి. లలిత్‌కుమార్ అన్నారు. గురువారం పెద్దపల్లి జిల్లా రామగుండం ఏరియాలో బొగ్గు నాణ్యత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత ప్రమాణాలతో కూడిన బొగ్గును విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

బొగ్గు వెలికితీత సమయంలో బండరాళ్లు, మట్టి, షేల్ పొరలను వేరు చేసి మంచి గ్రేడ్ బొగ్గును సరఫరా చేయాలని సూచించారు. జీడీకే-2ఏ భూగర్భ గనిలో షేల్ పొరలను వేరు చేస్తూ నాణ్యతను పెంచినట్లు వివరించారు. జీడీకే-1 ఇంక్లైన్‌లో నాణ్యమైన బొగ్గు సరఫరా కారణంగా స్థానిక వినియోగదారులు రోజుకు సుమారు 500 టన్నులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.

నాణ్యతతోనే మార్కెట్‌లో మనుగడ

ప్రైవేటు బొగ్గు సంస్థల నుంచి పోటీ ఉన్న నేపథ్యంలో నాణ్యతతోనే వినియోగదారులను నిలబెట్టుకోగలమని రామగుండం రీజియన్ క్వాలిటీ జీఎం వెంకటరమణ అన్నారు. ప్రతి ఉద్యోగి నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం క్వాలిటీ పతాకాన్ని ఆవిష్కరించి, నాణ్యత ప్రమాణాలపై రూపొందించిన కరపత్రాలను ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కె. చంద్రశేఖర్, ఏజీఎం కాశీ విశ్వేశ్వరరావు, క్వాలిటీ అధికారులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటిలింగాల ఆలయ అభివృద్ధికి పక్కా ప్రణాళిక

గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి..
భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ సత్యప్రసాద్



కరీంనగర్, సెప్టెంబర్ 19: రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆలయాన్ని సందర్శించి కొనసాగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు.

పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుష్కర ఘాట్లు, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, పార్కింగ్, వైద్య సదుపాయాలు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. భక్తులు సురక్షితంగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ పునర్నిర్మాణంతో పాటు పుష్కరాల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ ఆర్. శేఖర్, ఎంపీఓ కృపాకర్, కలగకుండా ప్రత్యేక సౌకర్యాలు సర్పంచ్ పర్స కోటయ్య, ఆలయ కమిటీ చైర్మన్ పుదరి రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అస్సాంలో వన్యప్రాణుల అక్రమ రవాణా యత్నాన్ని భగ్నం చేసిన డీఆర్ఐ.. 3.7 కిలోల బరువున్న రెండు ఏనుగు దంతాలు స్వాధీనం

న్యూఢిల్లీ, నవంబర్ 11:2026 నవంబర్ 5న గువాహటికి సుమారు 27 కిలోమీటర్ల దూరంలోని సోనాపూర్ టోల్ గేట్ సమీపంలో ఏనుగు దంతాల అక్రమ రవాణా యత్నాన్ని పక్కా సమాచారం ఆధారంగా రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) అధికారులు అడ్డుకున్నారు.

సాయంత్రం 5.40 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న అయిదుగురు అనుమానితులను డీఆర్ఐ అధికారులు గుర్తించారు. వారిలో ఒకరు ఏనుగు దంతాలు ఉన్నట్లు అనుమానిస్తున్న సంచిని తీసుకెళ్తున్నారు. అధికారులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. నిందితులు ఖుక్రీ, డావో (పదునైన ఆయుధాలు) చూపిస్తూ అధికారులపైకి దూసుకెళ్లారు. అనంతరం సంచిని అక్కడే వదిలేసి సమీపంలోని గ్రామంలోకి పారిపోయారు.

వదిలివెళ్లిన సంచిని తనిఖీ చేయగా.. 29 అంగుళాలు, 30 అంగుళాల పొడవు కలిగిన రెండు ఏనుగు దంతాలు లభించాయి. వీటి మొత్తం బరువు సుమారు 3.7 కిలోలు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 నిబంధనల ప్రకారం వాటిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు, చర్యల కోసం వాటిని అస్సాం రాష్ట్ర అటవీశాఖకు అప్పగించారు.

వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని షెడ్యూల్-ఎ, అంతరించిపోతున్న వన్యజీవులు, వృక్షజాతుల అంతర్జాతీయ వాణిజ్యంపై కన్వెన్షన్ (సీఐటీఈఎస్)లోని అనుబంధం-ఎ ప్రకారం ఏనుగు దంతాలకు రక్షణ ఉంది. రక్షించారు. ఇలాంటి రక్షిత జంతువుల నుంచి తయారైన వస్తువులను అమ్మడం, కొనడం లేదా వ్యాపారం చేయడం భారత చట్టాల ప్రకారం నిషేధం.

నిఘా సమాచారం ఆధారంగా చర్యలు చేపట్టడం, సంబంధిత ఇతర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకోవడం ద్వారా వన్యప్రాణుల అక్రమ రవాణా, రక్షిత జంతుజాతుల అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు డీఆర్ఐ కట్టుబడి ఉంది.

భోపాల్‌లో 6.642 కేజీల యాంఫెటమిన్‌ను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ: డ్రగ్ ట్రాఫికర్ అరెస్టు

నిర్దిష్ట సమాచారం ఆధారంగా, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు 2026 నవంబర్ 5న ఢిల్లీ నుంచి భోపాల్‌కు బస్సులో ప్రయాణిస్తున్న మాదకద్రవ్యాల స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణికుడిని అధికారులు తనిఖీ చేశారు. బ్యాగ్‌లో మూడు వెండి రంగు ప్లాస్టిక్ ప్యాకెట్లలో దాచి ఉంచిన 6.642 కిలోల బరువున్న తెల్లటి స్ఫటిక పదార్థాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్డీపీఎస్ ఫీల్డ్ టెస్ట్ కిట్‌ను ఉపయోగించి పరీక్షించినప్పుడు స్వాధీనం చేసుకున్న పదార్థం యాంఫెటమిన్‌గా నిర్ధారణ అయింది. ఇది నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టెన్స్ (ఎన్డీపీఎన్) చట్టం-1985 నియంత్రణ పరిధిలోకి వచ్చే సైకోట్రోపిక్ పదార్థం. ఎన్డీపీఎస్ చట్టం-1985 లోని సంబంధిత నిబంధనల మేరకు అధికారులు ఆ యాంఫెటమిన్‌ను జప్తు చేశారు. అలాగే ఈ చట్టం ప్రకారం నిందితుడైన ప్రయాణికుడిని అరెస్టు చేశారు.

కోల్‌కతా విమానాశ్రయంలో విదేశీ కరెన్సీ అక్రమ తరలింపు యత్నాన్ని అడ్డుకున్న డీఆర్ఐ రూ.3.5 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ స్వాధీనం, ఏడుగురి అరెస్టు

న్యూ ఢిల్లీ, నవంబర్ 12: విదేశీ కరెన్సీని దేశ సరిహద్దులు దాటి అక్రమంగా తరలించే ప్రయత్నాలను రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) భగ్నం చేసింది. తాజాగా కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో (ఎన్ఎస్‌సీబీఐ) విదేశాలకు వెళ్లేందుకు సిద్ధమైన పలువురు ప్రయాణికులను డీఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. వీరు దేశం నుంచి విదేశీ కరెన్సీని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పక్కా సమాచారం ఆధారంగా 2026 నవంబర్ 6 తెల్లవారుజామున బ్యాంకాక్‌కు ప్రయాణిస్తున్న ఏడుగురు ప్రయాణికులను డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వ్యక్తిగత తనిఖీలతో పాటు చేతి సంచులు, విమానంలో చెక్-ఇన్ చేసిన సామానును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో యూఎస్ డాలర్లు, బ్రిటిష్ పౌండ్ల (జీబీపీ) రూపంలో ఉన్న వివిధ విదేశీ కరెన్సీలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మొత్తం రూ.3.12 కోట్లు ఉంటుందని అంచనా. ఈ ముఠా సభ్యులు విదేశీ కరెన్సీని తరలించేందుకు పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. నోట్‌బుక్కుల్లో, ట్రాలీ బ్యాగుల్లో రెండు పొరలతో ఏర్పాటు చేసిన రహస్య అరల్లో, బూట్లలో కరెన్సీని చాకచక్యంగా దాచిపెట్టారు. మరికొంత మొత్తాన్ని చెక్-ఇన్ బ్యాగేజీలో సర్దిన దుస్తుల జేబుల్లో, చేతి సంచుల్లో దాచారు. విచారణలో ఆ కరెన్సీ తమదేనని లేదా చట్టబద్ధంగా తమ వద్ద ఉండని నిరూపించే ఎలాంటి పత్రాలనూ ప్రయాణికులు చూపించలేకపోయారు.



వాతావరణం విషయంలో అంతర్జాతీయ సహకారానికి, న్యాయమైన, ప్రతిష్టాత్మకమైన ఫలితం సాధించేందుకు అంటాల్య (టర్కీ)లో జరిగే యూఎన్ఎఫ్‌సీసీసీ కాప్-31లో నిబద్ధతను స్పష్టం చేసిన భారత్

న్యూ ఢిల్లీ, నవంబర్ 12: వాతావరణ అంశంలో అంతర్జాతీయ సహకారానికి, సమానత్వం, ఉమ్మడి అయినప్పటికీ భిన్నమైన బాధ్యతలు, సామర్థ్యానికి తగినట్లుగా వ్యవహరించటం (సీబీడీఆర్-ఆర్‌సీ) వంటి సూత్రాల పట్ల భారత్ నిబద్ధతను మరోసారి స్పష్టం చేసింది. టర్కీలోని అంటాల్యాలో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల వ్యవస్థ సదస్సు (యూఎన్ఎఫ్‌సీసీసీ) 31వ పక్షాల సమావేశం (కాప్-31)లో న్యాయమైన, సమానమైన, ప్రతిష్టాత్మకమైన ఫలితాల సాధనకు పిలుపునిచ్చింది.

కాప్-31 సదస్సులో భారత్ తరఫున కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ సరేంద్ర భూషణ్ ప్రారంభోత్సవ ప్రసంగం చేశారు. కాప్-31కి నాయకత్వం వహిస్తున్న టర్కీ, ఆస్ట్రేలియాకు కృతజ్ఞతలు తెలిపారు. వాతావరణ అంశంలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిన అన్ని పక్షాలను, చర్చల బృందాలను ఆయన అభినందించారు. జీ-77, చైనా, ఎల్ఎండీసీ, బేసిక్ దేశాలు చేసిన ప్రకటనలతో భారత్ ఏకీభవిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

అంతర్జాతీయ సహకార ప్రాముఖ్యతను తెలియజేస్తూ... యూఎన్ఎఫ్‌సీసీసీ, పారిస్ ఒప్పందం వంటివి దేశాలకు గళం వినిపించే సమగ్ర వేదికలని భారత్ స్పష్టం చేసింది. సమానత్వం, సీబీడీఆర్-ఆర్‌సీ సూత్రాలపై ఆధారపడి ఈ ప్రక్రియపై అచంచలమైన విశ్వాసం ఉందని భారత్ పేర్కొంది. చర్చలు, ఏకాభిప్రాయం, చర్య అనే మార్గదర్శకాలతో కూడిన 'అమలుకు సంబంధించిన కాప్' అధ్యక్షతా దృక్పథాన్ని భారత్ స్వాగతించింది. చర్చల ద్వారా నమ్మకం కుదురుతుందని, ఏకాభిప్రాయం వల్ల ఫలితాలపై ఉమ్మడి బాధ్యత కలుగుతుందని, వాగ్దానాలను క్షేత్రస్థాయిలో ఆచరణలోకి తీసుకువచ్చేందుకు చర్యలు దోహదపడతాయని భారత్ పేర్కొంది.

ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్‌ను దాటితే భవిష్యత్తులో సవాళ్లు మరింత పెరుగుతాయని భారత్ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎదుర్కొనే ఉమ్మడి ప్రయత్నాల్లో ఎవరూ వెనుకబడిపోకుండా చూసేందుకు సమానత్వం ఆవశ్యకమని చెప్పింది. ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తూనే.. ప్రపంచ వాతావరణ చర్యలకు తగిన భాగస్వామ్యాన్ని అందించాలన్న నిబద్ధతను భారత్ స్పష్టం చేసింది. కేవలం అభివృద్ధి చెందుతున్న దేశాలకే కాక ప్రత్యేకించి గ్లోబల్ సౌత్ దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు న్యాయమైన పరివర్తన, అనుకూలమైన అవసరాలను తీర్చటం వంటివి అభివృద్ధి సవాలుతో ముడిపడున్నట్లు భారత్ పేర్కొంది.

వాతావరణ ఆర్థిక సహాయం అంశంపై మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వాతావరణ చర్యలను వేగవంతం చేసేందుకు, బలహీనతలను ఎదుర్కొనేందుకు అనుకూల ఆర్థిక పెట్టుబడులను బలోపేతం చేయటంలో అభివృద్ధి చెందిన దేశాల నుంచి వచ్చే ప్రభుత్వ నిధులే ప్రధానమని భారత్ స్పష్టం చేసింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక వనరులను సమకూర్చాల్సిన అభివృద్ధి చెందిన దేశాల బాధ్యతను నిర్దేశించే పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 9.1 ప్రాథమిక ప్రాముఖ్యతను గుర్తుచేసింది. కాప్-31 వద్ద నిర్మాణాత్మక భాగస్వామ్యాన్ని భారత్ స్పష్టం చేసింది. అందరికీ ఆమోదయోగ్యమైన, న్యాయమైన, ప్రతిష్టాత్మకమైన ఫలితాలను సాధించే దిశగా అన్ని పక్షాలతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేసింది.

రేషన్ డీలర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

-ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ చెల్లించాలి
-పాత బియ్యం తరుగు పేరుతో డీలర్లను వేధించడం ఆపాలి.. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
-ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసిన రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు

సంగారెడ్డి నవంబరు 12 (నేటి నిజం ప్రతినిధి) ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 17,200 మంది రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ చెల్లించాలని కోరారు. సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు గురువారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సదాశివపేట అధ్యక్షుడు కె.బసంతప్ప, నిజాంపూర్ ప్రధాన కార్యదర్శి ఎం.మంతయ్య, కంది ప్రతినిధి ప్రభాకర్ తదితరులు డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా రేషన్ డీలర్లను విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

ఎన్నికల ముందు రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ చెల్లించడంతో పాటు రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఆ హామీలను అమలు చేయకపోవడం ద్వారా రాష్ట్రంలోని 17,200 మంది రేషన్ డీలర్లను ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కనీసం రేషన్ డీలర్ల సంఘం నాయకులకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం విచారకరమన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అందించే బియ్యం పరిమాణాన్ని ఒక్కొక్కరికి నాలుగు కిలోల నుంచి ఆరు కిలోలకు పెంచడంతో పాటు 20 కిలోల పరిమితిని తొలగించారని తెలిపారు. అప్పటి మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్ రేషన్ డీలర్ల సంఘం నాయకులతో చర్చించి కమిషన్‌ను రూ.140కు పెంచారని పేర్కొన్నారు. అప్పట్లో క్వింటాలుకు రూ.300 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తుతం పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉండి ఆ హామీ అమలుపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పేద కార్డుదారులను ఆదుకునేందుకు రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు మరిన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ షాపుల్లో సుమారు రూ.600 కోట్ల విలువైన పాత దొడ్డు బియ్యం 16 నెలలుగా నిల్వ ఉండిపోయిందని ఆరోపించారు. సకాలంలో వేలం వేయకపోవడంతో ఆ బియ్యం పురుగులు, ఎలుకలు, వందికొక్కుల బారినపడి పాడైపోతున్నాయని విమర్శించారు. ఈ నష్టానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, పాత బియ్యంలో తగ్గిన తరుగు మొత్తాన్ని డీలర్లే తమ జేబుల్లోంచి చెల్లించాలని ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు.

సంగారెడ్డి జిల్లాలోని చిన్నచిన్న రేషన్ షాపుల్లో నిల్వ చేసేందుకు తగిన స్థలం లేకపోయినా మూడు నెలల సన్నబియ్యాన్ని ఒకేసారి నిల్వ చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పురుగులు, ఎలుకల కారణంగా పాడైన పాత బియ్యంలో ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు తరుగు పేరుతో డీలర్ల నుంచి వసూలు చేయాలని ప్రయత్నించడం దారుణమన్నారు. జిల్లా అధికారులు వెంటనే ఈ వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల కారణంగా పౌరసరఫరాల సంస్థ భారీ అప్పుల్లో కూరుకుపోయిందని చింతా ప్రభాకర్ ఆరోపించారు. సన్నబియ్యం, సన్నవడ్ల బోనస్, గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన నిధులను సకాలంలో విడుదల చేయకుండా సంస్థపై ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు.

ఒకవైపు మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులకు లక్షల కోట్ల వ్యయంతో పాటు ఇతర కార్యక్రమాలకు వందల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి రూ.100 కోట్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.18 కోట్లు కేటాయిస్తోందని ఆరోపించారు. కానీ పేదలకు నిత్యావసర సరుకులు అందించే 17,200 మంది రేషన్ డీలర్లకు నెలకు రూ.10 కోట్ల వ్యయంతో రూ.5 వేల గౌరవ వేతనం చెల్లించేందుకు మాత్రం ప్రభుత్వం ముందుకు రావడం లేదని మండిపడ్డారు.

రేషన్ డీలర్లు ఎవరూ అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ వారి సమస్యల పరిష్కారం కోసం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున రేషన్ డీలర్ల సమస్యలను బలంగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.

రీ సర్వే పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలి

రైతుల అభ్యంతరాలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలి..
ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి-కలెక్టర్ సత్యప్రసాద్



కరీంనగర్, సెప్టెంబర్ 19: భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి తప్పులు, పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటలో కొనసాగుతున్న రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా భూముల హద్దులు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. రైతులు, భూ యజమానుల నుంచి వచ్చే అభ్యంతరాలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని, నిర్ణీత గడువులో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించాలని, నిర్మాణాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ అధికారి భాస్కర్, ల్యాండ్ సర్వే ఏడీ, ఎంపీఓ కృపాకర్, తహసీల్దార్ ఆర్. శేఖర్, సర్పంచ్ నల్ల తిరుపతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాజధాని బస్సులో ఎమర్జెన్సీ అలారం..

ప్రయాణికుల్లో ఆందోళన!
బస్సును నిలిపివేసిన డ్రైవర్..
మరో బస్సు కోసం ప్రయాణికుల నిరీక్షణ



కరీంనగర్, సెప్టెంబర్ 19:కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ రాజధాని ఏసీ బస్సులో ఎమర్జెన్సీ అలారం మోగడంతో డ్రైవర్ అప్రమత్తమై తిమ్మాపూర్ శివారులో బస్సును నిలిపివేశారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో అలారం మోగడంతో ప్రయాణికులు డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. అలారం ఎంతకూ ఆగకపోవడంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు బస్సు దిగి బయటకు వచ్చారు. ఇటీవల ఎలక్ట్రిక్ బస్సుల్లో చోటుచేసుకున్న ప్రమాదాల నేపథ్యంలో డీజిల్ బస్సులోనూ అలారం మోగడంతో ఏం జరిగిందో అర్థంకాక ఆందోళన చెందారు.

అయితే, బస్సు బ్రేక్‌డౌన్ కావడంతో ప్రత్యామ్నాయ బస్సు ఏర్పాటు చేసేందుకు అధికారులు త్వరగా స్పందించలేదని ప్రయాణికులు ఆరోపించారు. బస్సులో విమానాశ్రయానికి వెళ్లాల్సిన ప్రయాణికులు కూడా ఉండటంతో విమానం మిస్ అయితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. చివరకు మరో బస్సు రావడంతో ప్రయాణికులు హైదరాబాద్‌కు బయలుదేరారు.

జలాశయాల నీరు తాగేందుకే.. సాగునీటికి మళ్లిస్తే చర్యలు!

గాజులదిన్నె, నుంకేసుల జలాశయాలపై కలెక్టర్ కఠిన ఆంక్షలు
ఎన్నికల పెండింగ్ ఫారాల పరిష్కారానికి నవంబర్ 20 గడువు
22ఏ దరఖాస్తుల పరిష్కారానికి నవంబర్ 16 తుది గడువు

అమరావతి, నవంబర్ 12: జిల్లాలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని గాజులదిన్నె ప్రాజెక్ట, నుంకేసుల జలాశయాల్లో నిల్వ ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి స్పష్టం చేశారు. సాగునీటి అవసరాలకు నీటిని మళ్లించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇతర అవసరాలకు, ముఖ్యంగా వ్యవసాయానికి నీటిని వినియోగిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గురువారం రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పలు అంశాలపై సమీక్షించారు. జలాశయాల పరిసర గ్రామాల్లో నీటి వినియోగంపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. తాగునీరు మినహా ఇతర అవసరాలకు నీటిని వినియోగించరాదనే విషయంపై గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆర్డీఓలను ఆదేశించారు.

ఎన్నికలకు సంబంధించిన పెండింగ్ ఫారాల పరిశీలన, పంపిణీ ప్రక్రియను నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 2,400 మంది బీఎల్ఓలు ఉన్నారని, ఒక్కో బీఎల్ఓ పరిధిలో సగటున మూడు నుంచి నాలుగు ఫారాల పరిశీలన మాత్రమే మిగిలి ఉందని తెలిపారు. నవంబర్ 13వ తేదీ వరకు అందే ఫారాలను వెంటనే పరిశీలించి వారంలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బుక్-ఏ కాల్ కేసులను కూడా తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

బియ్యం పంపిణీపై వార్తాపత్రికల్లో వస్తున్న కథనాలను తీవ్రంగా పరిగణించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సంబంధిత ప్రాంతాల్లో ఆర్డీఓలు, తహసీల్దార్లు వెంటనే రైస్ కౌంటర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. అన్ని మండలాల నుంచి వారం రోజుల్లో సమగ్ర నివేదికలు సమర్పించాలని, ఈ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. 22ఏ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం జిల్లాలో 290 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ నవంబర్ 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పరిష్కరించాలని ఆదేశించారు.

శ్రీశైలం దేవస్థానానికి వాహన విరాళం

లక్షల విలువైన టాటా గూడ్స్ కంటైనర్ ట్రక్ అందజేత
అన్నప్రసాదానికి అవసరమైన కూరగాయల సరఫరాకు వినియోగం

అమరావతి, నవంబర్ 12: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, శ్రీశాఖ ఆధ్వర్యంలో గురువారం టాటా గూడ్స్ కంటైనర్ ట్రక్‌ను విరాళంగా అందజేశారు. ఈ విషయాన్ని దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. దేవాలయ ప్రాంగణంలోని గంగాధర మండపం వద్ద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్‌రెడ్డి వాహనంతో పాటు సంబంధిత పత్రాలను ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడుకు అందజేశారు. అంతకుముందు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు, అర్చకస్వాములు, దేవస్థానం అధికారులు, బ్యాంకు ప్రతినిధులు సంప్రదాయబద్ధంగా వాహన పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టాటా గూడ్స్ కంటైనర్ ట్రక్‌ను కొనుగోలు చేసి దేవస్థానానికి విరాళంగా అందజేసినట్లు తెలిపారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ ఈ వాహనాన్ని అన్నప్రసాద వితరణకు అవసరమైన కూరగాయల సరఫరా కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎం. సుధాకర్, శ్రీశైలం బ్రాంచ్ మేనేజర్ రవీంద్రారెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. దేవస్థానం తరఫున సహాయ కమిషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారులు జి. స్వాములు, ఎం. హరియానాయక్, పి. ఉమేష్, పర్యవేక్షకులు సి.హెచ్. కోమలి, రవాణా విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ ఎం. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ కో-ఆప్షన్ సభ్యులు, ఉపాధ్యక్షుల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

నవంబర్ 19న ఎన్నికలు.. 14లోగా సభ్యులకు నోటీసులు అందజేయాలి
రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి

అమరావతి, నవంబర్ 12: జిల్లాలో మండల ప్రజా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు, ఉపాధ్యక్షుల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. గురువారం రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. నవంబర్ 19వ తేదీన సంబంధిత మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో, కనీసం ఆరు రోజుల ముందుగా అంటే నవంబర్ 14వ తేదీలోపు ఎంపీడీవోలు, ప్రిసైడింగ్ అధికారులు మండల ప్రజా పరిషత్ సభ్యులందరికీ ఫారం-2 ద్వారా ఎన్నికల నోటీసులు అందజేయాలని సూచించారు. నోటీసులు అందుకున్నట్లు సభ్యుల నుంచి తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలన్నారు.

నవంబర్ 19వ తేదీన ఉదయం 10 గంటలలోపు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ఫారం-3 ద్వారా నామినేషన్లు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు నిర్దేశిత అర్హతలు కలిగి ఉండాలని, ప్రతిపాదకులు, బలపరిచే సభ్యులు కూడా సంబంధిత మండల ప్రజా పరిషత్‌కు ఎన్నికైన సభ్యులై ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థికి 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని, నిబంధనల ప్రకారం మత లేదా భాషా అల్పసంఖ్యాక వర్గానికి చెందిన అర్హతను సంబంధిత ధ్రువపత్రాలతో నిర్ధారించుకోవాలని సూచించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించి, అనంతరం నిర్ణీత నిబంధనల ప్రకారం ఉపసంహరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశం నిర్వహించి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాణ స్వీకార పత్రాలను రెండు ప్రతులుగా సిద్ధం చేసి, ఒక ప్రతిని సభ్యునికి అందజేయాలని, మరో ప్రతిని ప్రిసైడింగ్ అధికారి వద్ద భద్రపరచాలని సూచించారు. మినిట్స్ పుస్తకంలోనూ సభ్యుల సంతకాలు తీసుకోవాలన్నారు. ఎన్నిక ఏకగ్రీవం కాని పక్షంలో నిబంధనల ప్రకారం చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించాలని తెలిపారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బెజవాడ యువకలాలు

రజతోత్సవం





బి. ఆంజనేయ రాజు గారి స్మరణలో...

ద్వితీయ ముద్రణ ఆవిష్కరణ సభ

తేదీ: 19-11-2026 గురువారం సాయంత్రం 6 గంటలకు

వేదిక: ఠాగూర్ స్మారక గ్రంథాలయం, విజయవాడ

సభాధ్యక్షులు: డాక్టర్ గుమ్మా సాంబశివరావు గారు
(ప్రముఖ సాహితీవేత్త)

ముఖ్య అతిథి: శ్రీ సత్యాజి గారు
(వర్కింగ్ ఎడిటర్, సాహిత్య ప్రస్థానం మాసపత్రిక)

ఆత్మీయ అతిథి: శ్రీ సింగంపల్లి అశోక్ కుమార్ గారు
('ఆలోచన' వ్యవస్థాపకులు)

ఆంజనేయ రాజు గారి జ్ఞాపకాలను స్మరించుకునేందుకు
ఆయన అభిమానులందరూ విచ్చేయాలని కోరుతున్నాము.

ఆహ్వానించువారు
కె. రమాదేవి, గ్రంథాలయ అధికారిణి మరియు
బెజవాడ యువ కలాలు

భూముల రీ సర్వేలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు!

రైతుల సమక్షంలోనే భూముల కొలతలు..
రోజుకు 30 ఎకరాల సర్వే పూర్తి చేయాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, సెప్టెంబర్ 19: భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, పారదర్శకంగా నిర్వహించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం నియోజకవర్గంలోని మెండోరా మండలం వెల్గటూర్‌లో కొనసాగుతున్న రీ సర్వే పనులను అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోవర్ సహాయంతో చేపడుతున్న సర్వే తీరును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రోజుకు సగటున 30 ఎకరాల చొప్పున సర్వే పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన అదనపు రోవర్ యంత్రాలను సమకూరుస్తామని తెలిపారు. సర్వేకు ముందు రైతులకు సమాచారం అందించి, వారి సమక్షంలోనే భూముల కొలతలు చేపట్టాలని స్పష్టం చేశారు.

భూముల హద్దులు, ప్రభుత్వ భూములు, పట్టా భూముల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. సర్వే అనంతరం గ్రామసభలు నిర్వహించి రైతుల అభ్యంతరాలు, దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వేలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రాబ్యాంక వ్యవస్థాపకులు
శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి పేరుతో స్థాపించిన
డా॥ పట్టాభి కళా పీఠము
(ప్రతిభకు పట్టాభిషేకం)
(రి. 234/2010)
ప్లాట్ నెం. ఎ/404, శివ గ్రీన్ వ్యాలీ, గోరంట్ల, గుంటూరు - 522 034.

ఆహ్వానము

డా॥ పట్టాభి జయంతి – పట్టాభి అవార్డ్స్–2025 ప్రదానోత్సవ సభ (సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకం)

తేది : **14-11-2026** (2వ శనివారం)
వేదిక : **పెన్షనర్ల భవనం**
తాలూకా కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.
సమయం : ఉదయం 10 గం॥లకు

సభా కార్యక్రమం

సభాధ్యక్షులు :
డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్
అధ్యక్షులు, డా॥ పట్టాభి కళాపీఠము

ముఖ్య అతిథి :
గౌ॥ శ్రీమతి పాడపాటి తేజస్విని గారు
అధ్యక్షురాలు, ఆం.ప్ర. సృజనాత్మక, సాంస్కృతిక సమితి, అమరావతి

విశిష్ట అతిథి :
ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు
ఉపకులపతి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

విశిష్ట అతిథి & పుస్తక ఆవిష్కర్త :
డా॥ ఓలేటి పార్వతీశం గారు
దూరదర్శన్ విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి, హైదరాబాద్

డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్ గారు ముద్రించిన
'శ్రీశ్రీశ్రీ గురు విశ్వమూర్తి వారి రచనలు–సమాలోచన' పుస్తకావిష్కరణ

ఆత్మీయ అతిథులు :
ఆచార్య పి. బ్రహ్మాజీరావు గారు
ప్రొఫెసర్, నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు
ఆచార్య మక్కెన శ్రీను గారు
ప్రొఫెసర్, ఎన్.టి.ఆర్. పశువైద్య కళాశాల, గన్నవరం

శ్రీ తూములూరి నారాయణదాసు – వినయదేవి స్మారక
జీవిత సాఫల్య పురస్కారం
ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు
ఉపకులపతి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
(రూ. 10,000/– నగదు, శాలువ, ప్రశంసాపత్రము, జ్ఞాపిక)
ప్రదాత : డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్, గుంటూరు

శ్రీ పావులూరి మోహన్‌రావు స్మారక ప్రతిభా
స్త్రీ-శక్తి పురస్కారం
శ్రీమతి బి.వి. శివకుమారి గారు
అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయశాఖ, గుంటూరు
(రూ. 5,000/– నగదు, శాలువ, ప్రశంసాపత్రము, జ్ఞాపిక)
ప్రదాత : డా॥ జి. రూన్సీలక్ష్మి, గద్వాల్

2025 సంవత్సరానికి జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్ఠులైన నవరత్నాలకు రూ. 1,000/– నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువతో ప్రతిభా పురస్కారాల ప్రదానం

ప్రక్రియ	పురస్కార గ్రహీత	ప్రదేశం
1. విద్య	డా॥ టి.జె. రాజేంద్రప్రసాద్	గుంటూరు
2. చరిత్ర-పరిశోధన	శ్రీ పంచుమర్తి సత్యనారాయణ	గుంటూరు
3. మీడియా	డా॥ ఓలేటి పార్వతీశం	హైదరాబాద్
4. గానం	శ్రీ తాతా బాలకామేశ్వరరావు	హైదరాబాద్
5. రంగస్థల నటులు (సుబ్బిశెట్టి ఫేమ్)	శ్రీ అలకుంట శ్రీనివాసరావు	అద్దంకి
6. పత్రికారంగం	శ్రీ బైసా దేవదాసు	హైదరాబాద్
7. వైద్యరంగం	ప్రొ॥ ఎమ్. ముత్తారావు	లాం, గుంటూరు
8. పర్యావరణం	ప్రొ॥ పి. బ్రహ్మాజీరావు	గుంటూరు
9. సాహిత్యం (కథ)	శ్రీ వడలి రాధాకృష్ణ	చీరాల

ప్రతిభామూర్తులకు సత్కారం

1. **శ్రీ పాత్తూరి సుబ్బారావు గారు,** సంపాదకులు, సాహితీ కిరణం మాసపత్రిక, హైదరాబాద్
2. **శ్రీమతి మన్నే అనూరాధ గారు,** గుంటూరు. Sr. Manager (Retd.), Union Bank of India (Andhra Bank)
3. **శ్రీ ఎమ్. శ్రీనివాసరావు గారు,** గుంటూరు, Asst. General Manager (Retd.) Union Bank of India (Andhra Bank),
4. **శ్రీ అమరనేని వెంకటేశ్వర్లు గారు,** హైదరాబాద్ Circle Inspector (Retd.)
5. **శ్రీ ఎమ్. వెంకట కిషోర్ గారు,** కిషోర్ గ్రాఫిక్స్, విజయవాడ.
6. చి॥ **పెద్ది అభినవ కార్తికేయ,** 4th Class, National Public School, White Field, Bangalore

రూ.37,500 కోట్ల విలువైన ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకంలో 2వ రౌండు ముగింపు

న్యూ ఢిల్లీ, నవంబర్ 12: రూ.37,500 కోట్ల వ్యయంతో ఉపరితల బొగ్గు/నేలబొగ్గు (లిగ్నైట్) గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకాన్ని చేపట్టడానికి కేంద్ర మంత్రిమండలి 2026 మే 13న ఆమోదం తెలిపింది. దేశంలో ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను వేగవంతం చేయడం ఈ స్కీము లక్ష్యం.

రెండో రౌండు ముగిసినట్లు బొగ్గు మంత్రిత్వశాఖ ఈ రోజు ప్రకటించింది. దీంతో పథకం లక్ష్యాలను ముందుకు తీసుకు పోవడంలో ముందడుగు వేసినట్ల యింది. 2వ రౌండులో ఎన్‌టీపీసీ సంస్థ రెండు దరఖాస్తులు దాఖలు చేసింది. ఈ దరఖాస్తులు యూరియా, మెథనాల్, డైమిథైల్ ఈథర్ (డీఎమ్ఈ) ఉత్పాదనకు సంబంధించినవి. కీలక పారిశ్రామిక ఉత్పాదనలను దేశీయంగా ఉత్పత్తి చేయడానికీ, అలాగే భారతదేశంలో స్థానిక వనరుల వినియోగాన్ని వివిధ ప్రయోజనాలకు వాడుకోవడానికీ కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియ శక్తియుక్తుల్ని ఉపయోగించుకోవచ్చని ఈ దరఖాస్తుల్లో ప్రస్తావించారు.

మొదటి రెండు రౌండ్ల ప్రగతిని బొగ్గు మంత్రిత్వశాఖ పరిగణనలోకి తీసుకొని, పథకంలో మూడో రౌండును 2026 నవంబర్ 10 నాటి నుంచి ప్రారంభించింది. దీని ద్వారా, అర్హతలు గల సంస్థలు దేశంలో బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలను సమర్పించడానికి మరో అవకాశాన్ని కల్పిస్తున్నారు. 3వ రౌండులో దరఖాస్తులను దాఖలు చేయడానికి 2027 జనవరి 11ఆఖరు గడువు తేదీ అని పేర్కొన్నారు. వరసగా రౌండ్లను నిర్వహిస్తూ, పారిశ్రామిక రంగంలో మరిన్ని సంస్థలను దీనిలో పాలుపంచుకొనేటట్లు ప్రోత్సహించి పెట్టుబడులను ఆకర్షించి బొగ్గును సింథటిక్ గ్యాసును మార్చే (కోల్ గ్యాసిఫికేషన్) సాంకేతికతల అనుసరణను వేగవంతం చేసి, 2030 కల్లా 100 మిలియన్ టన్నుల కోల్ గ్యాసిఫికేషన్ లక్ష్య సాధనకు తోడ్పడాలని బొగ్గు శాఖ ధ్యేయంగా పెట్టుకుంది. సింథెటిక్ గ్యాసు (దీనిని 'సిన్‌గ్యాస్' అని కూడా పిలుస్తారు. దీనిని అనేక రకాలైన ఎరువులు, ఇంధనాలు, ద్రావకాలతో పాటు రసాయనిక ఉత్పాదనలు, పదార్థాలను తయారు చేయడానికి కూడా ఉపయోగించవచ్చు.

ప్రత్యేక ప్రచారం 6.0లో ఆయుష్ మంత్రిత్వ శాఖ గణనీయమైన పురోగతి

ప్రత్యేక ప్రచారం 6.0లో భాగంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ గణనీయమైన పురోగతి సాధించింది. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, రికార్డుల సమర్థవంతమైన నిర్వహణ, కార్యాలయాల్లో పరిశుభ్రతకు ఈ ప్రచారంలో అధిక ప్రాధాన్యత ఇచ్చింది.

ఈ ప్రచారంలో భాగంగా మంత్రిత్వ శాఖ 368 ప్రజా ఫిర్యాదులు, 64 ప్రజా ఫిర్యాదులకు సంబంధించిన అప్పీళ్లను పరిష్కరించింది. బాధ్య తాయుతమైన, పారదర్శకమైన, పౌరుల అవసరాలకు ప్రాధాన్యతనిచ్చే పాలన పట్ల తన నిబద్ధతను చాటుకుంది. అలాగే పార్లమెంటు సభ్యుల నుంచి వచ్చిన 7 సూచనలు, ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) నుంచి వచ్చిన 4 సూచనలను కూడా పరిష్కరించింది. ఫిర్యాదులను సకాలంలో, సమర్థవంతంగా పరిష్కరించడంపై మంత్రిత్వ శాఖ చూపుతున్న నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తోంది.

ఈ ప్రచారంలో భాగంగా కార్యాలయాల పరిశుభ్రతను మెరుగుపరచడం, ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని ప్రోత్సహించడం, కార్యాలయ స్థలాన్ని మెరుగ్గా వినియోగించుకోవడం లక్ష్యంగా 285 పారిశుద్ధ్య కార్యక్రమాలను మంత్రిత్వశాఖ నిర్వహించింది.

రికార్డుల నిర్వహణలో భాగంగా 1,610 ఫైళ్లను సమీక్షించి, అవసరం లేని వాటిని తొలగించి, మూసివేశారు. పనికిరాని వస్తువులు, పాత రికార్డులను తొలగించడం ద్వారా మొత్తం 8,741 చదరపు అడుగుల స్థలాన్ని ఖాళీ చేశారు. ఈ స్థలాన్ని ఇతర అవసరాలకు మరింత సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం కల్పించారు. పాత వస్తువుల విక్రయం ద్వారా రూ. 1,94,161 ఆదాయాన్ని ఆర్జించారు. వనరుల మెరుగైన నిర్వహణ, వరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా మంత్రిత్వ శాఖ చేస్తున్న ప్రయత్నాలను ఇది ప్రతిబింబిస్తోంది.

సూక్ష్మ సంస్థల రుణ గ్యారంటీ నిధి కొనసాగింపునకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ, నవంబర్ 11:' మైక్రో యూనిట్ల రుణ గ్యారంటీ నిధి' (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని 31.03.2031 వరకు మరో ఐదేళ్ల పాటు కొనసాగించేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సీజీటీసీ) ద్వారా ఎగవేతల నుంచి రుణాన్ని మంజూరు చేసే సంస్థలకు గ్యారంటీ రక్షణను అందిస్తుంది.

2026 సెప్టెంబర్ నాటికి ఉన్న గణాంకాల ప్రకారం పీఎం ముద్రా యోజన (పీఎంఎంవై) ప్రారంభమైనప్పటి నుంచి రుణాలు మంజూరు చేసే సంస్థలు రూ. 43.34 లక్షల కోట్ల విలువైన 60.36 కోట్లకు పైగా రుణాలను మంజూరు చేశాయి. 2016 జనవరిలో ప్రారంభమైన సీజీఎఫ్ఎంయూ.. దేశంలో పీఎం ముద్రా రుణాల వేగవంతమైన విస్తరణ, వృద్ధికి ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా వ్యవహరించింది.

రుణాన్ని మంజూరు చేసే సంస్థలకు కింది వాటిపై రుణ గ్యారంటీ రక్షణను అందించడమే ఈ నిధి ప్రధాన లక్ష్యం:

ప్రధానమంత్రి ముద్రా యోజన కింద అర్హత కలిగిన సూక్ష్మ పరిశ్రమలకు అందించే రూ. 20 లక్షల వరకు రుణాలకు గ్యారంటీ.

ప్రధానమంత్రి జన ధన్ యోజన ఖాతాల కింద బ్యాంకులు మంజూరు చేసే రూ. 10,000 వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయానికి గ్యారంటీ.

రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు పోర్ట్‌ఫోలియో ఉన్న స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసే రుణాలకు గ్యారంటీ.

గ్యారంటీ కవరేజీ: రుణాన్ని మంజూరు చేసే సంస్థల వాస్తవిక నష్ట భయాన్ని ప్రతిబింబించేలా నిర్వహణ మూలధన పరిమితుల విషయంలో ఇచ్చిన మొత్తానికి, టర్మ్ లోన్ ఖాతాల విషయంలో బకాయి ఉన్న మొత్తానికి గ్యారంటీ కవరేజ్ అనుసంధానమై ఉంటుంది.

డిజిటల్ యుగంలోనూ పండుగ శుభాకాంక్షలకు వ్యక్తిగత ఆత్మీయతను జోడిస్తూ దీపావళి విశిష్టతను చాటిచెప్పే వినూత్న ప్రచారం

న్యూఢిల్లీ, నవంబర్ 11:క మ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని తపాలా శాఖ ఇండిగో విమానయాన సంస్థతో కలిసి 'డిజిటల్ డీటాక్స్ 2.0' కార్యక్రమాన్ని నిర్వహించింది. విమాన ప్రయాణంలో పోస్టుకార్డులు రాసే తొలి విడత కార్యక్రమానికి లభించిన విశేష స్పందన నేపథ్యంలో దీన్ని మరోసారి నిర్వహించారు. పండుగల సీజన్‌ను పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రయాణికులు తమ ఆత్మీయులకు చేతిరాతతో కూడిన పోస్టుకార్డుల ద్వారా హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేసే అరుదైన అవకాశాన్ని పొందారు.

ఈ కార్యక్రమాన్ని 11 చోట్లకు వెళ్లే 15 ఇండిగో విమానాల్లో నిర్వహించారు. వీటిలో చండీగఢ్, రాంచీ, బాగ్‌డోగ్రా, ఢిల్లీ, ముంబై, గోవా, పుణె, అహ్మదాబాద్, కోల్‌కతా, వారణాసి, జైపూర్ ఉన్నాయి. ప్రయాణికులకు ప్రత్యేకంగా రూపొందించిన 'డిజిటల్ డీటాక్స్' కిట్‌లను అందజేశారు. వీటిలో పోస్టుకార్డులు, శుభాకాంక్షల కార్డులు, స్వయంగా తయారు చేసుకునే పోస్టుకార్డులతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన దీపావళి స్టిక్కర్లు ఉన్నాయి. మొబైల్ తెరలకు కొంతసేపు దూరంగా ఉంటూ, తమ ఆత్మీయుల కోసం వ్యక్తిగత సందేశాలతో పండుగ శుభాకాంక్షలను చేతిరాతతో తెలియజేయాలని ఈ కిట్‌ల ద్వారా ప్రయాణికులను ఉత్సాహపరిచారు.

తొలి విడత విజయవంతం కావడంతో, చేతిరాత ఉత్తరాల సంప్రదాయానికి మళ్లీ ప్రాచుర్యం కల్పించడంతో పాటు, సాంకేతిక పరికరాల వినియోగంలో విచక్షణ, సమతుల్యతను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. విమాన ప్రయాణికులకు ఉత్తరాలు రాసే అనుభూతిని పరిచయం చేయడం ద్వారా, డిజిటల్ ప్రపంచం వేగంగా విస్తరిస్తున్న నేటి కాలంలోనూ వ్యక్తిగత ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉన్న ప్రత్యేకత, చిరస్థాయిగా నిలిచే ఆకర్షణను ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

ఈ కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. ఇందులో పాల్గొన్న వలువురు తమ మధురానుభూతులను పంచుకున్నారు. ఒక ప్రయాణికుడు మాట్లాడుతూ, "30 వేల అడుగుల ఎత్తులో విమానంలో కూర్చుని పోస్టుకార్డు రాయడం అద్భుతమైన అనుభూతి. జీవితాంతం గుర్తుండిపోయే అనుభవం ఇది" అన్నారు. మరో ప్రయాణికుడు తన అనుభవాన్ని వివరిస్తూ, "నేను తొలిసారిగా పోస్టుకార్డు రాశాను. తక్షణమే డిజిటల్ సందేశాలు పంపుకునే ఈ కాలంలోనూ చేతిరాత సందేశాలకు ఎంత ప్రత్యేకత ఉంటుందో ఈ అనుభవం నాకు తెలియజేసింది" అని పేర్కొన్నారు. పండుగ శుభాకాంక్షలకు ఈ కార్యక్రమం అందించిన ప్రత్యేకతను ప్రశంసిస్తూ మరో ప్రయాణికుడు, "డిజిటల్ సందేశం పంపడం కంటే చేతిరాతతో కూడిన పోస్టుకార్డు ద్వారా దీపావళి శుభాకాంక్షలు తెలియజేయడం మరింత ఆత్మీయంగా, అర్థవంతంగా అనిపించింది" అని అన్నారు.

'డిజిటల్ డీటాక్స్ 2.0' కార్యక్రమం ద్వారా తపాలా శాఖ వినూత్న ప్రజా సంబంధ కార్యక్రమాల పట్ల తన నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది. ఉత్తరాల ద్వారా ప్రజల మధ్య అనుబంధాలను పెంపొందించే చిరకాల సంప్రదాయాన్ని ప్రోత్సహిస్తూ, దీపావళి వేడుకలకు మరింత ఆత్మీయతను జోడించింది.

దీపావళికి సొంతూళ్లకు వెళ్లే విమాన ప్రయాణికులకు ఇండియా పోస్ట్ ఈ కార్యక్రమం ద్వారా ఒక మరుపురాని అనుభవాన్ని అందించింది. చండీగఢ్, ముంబై, పుణే, జైపూర్, అహ్మదాబాద్, గోవా మార్గాల్లో ప్రయాణించే విమానాల్లో ప్రయాణికులు కొంతసేపు డిజిటల్ పరికరాలకు దూరంగా (డిజిటల్ డిటాక్స్) ఉంటూ, చేత్తో ఉత్తరాలు రాసే పాతకాలపు ఆత్మీయ సంస్కృతిని పునరుద్ధరించారు. డిజిటల్ స్క్రీన్‌లకంటే చేతిరాతతో పంపే పండుగ శుభాకాంక్షలే మనుషులను నిజంగా దగ్గర చేస్తాయని ఈ వినూత్న కార్యక్రమం నిరూపించింది.

చిరుధాన్యాధారిత వ్యవసాయ రూపాంతరీకరణ దిశగా జాతీయ స్థాయి భవిష్యత్ ప్రణాళికకు ఒడిషా రూపకల్పన

న్యూ ఢిల్లీ, నవంబర్ 12: వ్యవసాయ-జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయం, సుస్థిర ఆహార వ్యవస్థపై ఒడిషాలోని భువనేశ్వర్ నగరంలో రెండు రోజుల జాతీయ కార్యక్రమం ఈ రోజు ప్రారంభమైంది. రాష్ట్ర గవర్నర్ శ్రీ బ్రజ్ మోహన్ రామ్, వ్యవసాయ-రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ కనక్ వర్ధన్ సింగ్ దేవ్, 'దేర్' కార్యదర్శి-ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్, ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారితోపాటు రాష్ట్ర వ్యవసాయ-రైతు సాధికారత శాఖ కమిషనర్-కార్యదర్శి శ్రీ సచిన్ రామచంద్ర జాదవ్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, ఇతర భాగస్వాములు కూడా హాజరయ్యారు.

కార్యక్రమ ప్రారంభోత్సవం అనంతరం ప్రదర్శనశాలల సందర్శన, వ్యవసాయ ఆవిష్కరణలు, దేశీయ పంటల వైవిధ్యం, చిరుధాన్యాధారిత ఉత్పత్తుల ప్రదర్శన, రైతులతో మాటామంతీ తదితర కార్యకలాపాలు సాగాయి.

ఆ తర్వాత డాక్టర్ శ్రీ ఎం.ఎల్.జాట్ సభనుద్దేశించి మాట్లాడుతూ- వాతావరణ మార్పు, భూసారం, పోషకాలు తదితర పెను సవాళ్లను ఎదుర్కోవడం సహా చిరుధాన్యాలు, అవకాశానుగుణ పంటలపై మరింతగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. తద్వారా రాష్ట్రంలోని సుసంపన్న వ్యవసాయ-జీవవైవిధ్యాన్ని సద్వినియోగం చేసుకోవడమే కాకుండా సమయంలో సార్వత్రిక ఆరోగ్యం దిశగా స్థానిక ఆహార వ్యవస్థను ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.

రాష్ట్రం అమలు చేస్తున్న 'శ్రీ అన్న అభియాన్' విజయవంతం కావడాన్ని, చిరుధాన్యాధారిత వ్యవసాయ రూపాంతరీకరణలో జాతీయ నమూనాగా ఆవిర్భవించగల దాని సామర్థ్యాన్ని డాక్టర్ జాట్ ప్రముఖంగా ప్రస్తావించారు. దేశంలో 2047 నాటికి చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని 1.79 లక్షల హెక్టార్ల నుంచి 5 లక్షల హెక్టార్లకు పెంచడం సహా 8 లక్షల టన్నుల ఉత్పత్తిపై లక్ష్యనిర్దేశం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో 2024-25 ఖరీఫ్‌లో 7.5 లక్షల క్వింటాళ్ల రాగి పంట కొనుగోళ్లతో పాటు 2025-26 సీజన్‌లో 8 లక్షల క్వింటాళ్ల లక్ష్యం నిర్దేశించుకోవడాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే, దేశీయ చిరుధాన్యాల వైవిధ్యాన్ని.. ముఖ్యంగా నమోదిత 163 రాగుల స్థానిక రకాల పరిరక్షణ సహా కొలియా, బాటి, మామి, భారతి వంటి సంప్రదాయ రకాలను ప్రోత్సహించడం ముదావహమని చెప్పారు.

శాస్త్రీయ సాగు పద్ధతుల విస్తరణతో పాటు సువాన్, కంగు వంటి చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం, చౌక ప్రాసెసింగ్ యంత్రాల రూపకల్పన, 'ఎఫ్‌పీఓ'లు-మహిళా స్వయం సహాయ బృందాల బలోపేతం, ఐకార్, ఐఐఎంఆర్-హైదరాబాద్ ద్వారా చిరుధాన్యాధారిత సంస్థలు, మార్కెట్ అనుసంధాన విస్తరణపై ఈ కార్యక్రమంలో చర్చించారు. ఐకార్, ఐఐఎంఆర్-హైదరాబాద్ మధ్య పరిశోధన సహకార బలోపేతం, ఒడిషా వ్యవసాయ-సాంకేతిక విశ్వవిద్యాలయంలో చిరుధాన్యాలపై 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటును కూడా ఆయన ప్రతిపాదించారు.

సంస్థాగత భాగస్వామ్యాల బలోపేతం, విజ్ఞాన ఆదానప్రదానానికి ప్రోత్సాహం, సుస్థిర-వాతావరణ మార్పును తట్టుకోగల, ఆర్థికంగా లాభదాయక చిరుధాన్యాల ఆధారిత వ్యవసాయాభివృద్ధి దిశగా ఒడిషా ప్రస్థానాన్ని వేగిరపరచడం ఈ కార్యక్రమ లక్ష్యాలు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలను అందించిన భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 11: దిల్లీలో ఈ రోజు (నవంబర్ 11, 2026) 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26' పురస్కారాలను భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. కేవలం ఒకే సంస్థ ఒంటరిగా స్వచ్ఛతా లక్ష్యాలను సాధించలేదని స్పష్టం చేశారు. దీనికి ప్రతి ఒక్క పౌరుడు, ప్రతి ఇల్లు, ప్రతి సంఘం, ప్రతి నగర భాగస్వామ్యం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు. పరిశుభ్రత కేవలం బహిరంగ ప్రదేశాల సౌందర్యాన్ని కాపాడటానికి మాత్రమే పరిమితమైన అంశం కాదని.. అది మన ఆరోగ్యం, సామాజిక స్పృహ, పరిపాలనా జవాబుదారీతనానికి కూడా ఒక నిదర్శనమని ఆమె ఉద్ఘాటించారు. ఇది మన ఇళ్లలోని అలవాట్లకు కూడా ప్రతిబింబం అని తెలిపారు.

ప్రతి ఒక్క పౌరుడు ముఖ్యంగా యువత, మహిళలు, ఆర్డ బ్ల్యూఏలు (రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు), సామాజిక సంఘాలు పరిశుభ్రతకు సంబంధించిన వివిధ అంశాల్లో మమేకం కావాలని రాష్ట్రపతి పిలుపు నిచ్చారు. వారు తమ అనుభవాలను పంచుకోవాలని, ఏవైనా లోపాలు ఉంటే వాటిని తెలియజేయాలన్నారు. వాటిపై పని చేయటం ద్వారా మన నగరాలను మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దవచ్చని ఆమె పేర్కొన్నారు. ఇది ముని పల్ యంత్రాంగానికి, ప్రజలకు మధ్య నిరంతర చర్చను పెంపొందిస్తుందని.. తద్వారా పరస్పర విశ్వాసం, పౌరదర్శకత, జవాబుదారీతనం మరింత బలపడతాయని ఆమె ఉద్ఘాటించారు.

తన పరిసరాల పరిశుభ్రతను అంచనా వేసే విషయంలో ప్రజలే అత్యుత్తమ న్యాయనిర్ణేతలని రాష్ట్రపతి పేర్కొన్నారు. అందుకే ప్రజాభిప్రాయాల సేకరణ కేవలం సర్వేలు లేదా ర్యాంకింగ్‌లకు మాత్రమే పరిమితం కాకూడదని ఆమె స్పష్టం చేశారు. దానికి బదులుగా ఈ అభిప్రాయాలు మున్సిపల్ సేవలను మెరుగుపరచడానికి, స్థానిక సవాళ్లను పరిష్కరించడానికి ఒక కీలకమైన సాధనంగా ఉపయోగపడాలని ఉద్ఘాటించారు.పరిశుభ్రత విషయంలో సానుకూలమైన, ప్రభావవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతికతలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. పలు ఐఐటీలు, ఇతర శాస్త్రీయ పరిశోధనా సంస్థలతో సహా ఇతర సంస్థలు ఈ దిశగా చురుగ్గా పనిచేస్తుండటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.స్వచ్ఛతా రంగంలో అనేక రకాల అంకురాలు ఉద్భవించడాన్ని రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇటువంటి నూతన పారిశ్రామిక సంస్థలు పరిశుభ్రత విషయంలో ప్రత్యక్ష సవాళ్లను పరిష్కరించడంలో గణనీయమైన సహకారాన్ని అందించడమే కాకుండా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కూడా సృష్టించగలవని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

అత్యంత వేగంగా విస్తరిస్తున్న పట్టణ కేంద్రాలైన ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ నగరాలకు ప్రత్యేకమైన అవసరాలు, సవాళ్లు ఉన్నాయని.. వాటి ప్రత్యేక సమస్యలు, నవాళ్లను పరిష్కరించేలా రూపొందించిన ఒక జాతీయ చట్రం పరిధిలోనే వాటి అభివృద్ధి జరగాలని ఆమె సూచించారు. ప్రథమ శ్రేణి నగరాలు ఎదుర్కొన్న సమస్యల నుంచి ద్వితీయ శ్రేణి నగరాల ప్రణాళికాకర్తలు నేర్చుకోవచ్చని.. ఇందుకోసం వారు ప్రథమ శ్రేణి నగరాల ప్రణాళికాకర్తల అనుభవాలను అధ్యయనం చేయాలని ఆమె తెలిపారు.కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అందించే 'స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలు'.. భారత్‌లోని అత్యంత పరిశుభ్రమైన నగరాలను గౌరవిస్తూ 'పట్టణ స్వచ్ఛ భారత్ మిషన్'కు అవి అందించిన అత్యుత్తమ సహకారాన్ని గుర్తించి సత్కరిస్తాయి.

అనన్య సామాన్యం పురిపండా సాహిత్య సేవనం

నవంబర్ 13... కళాప్రపూర్ణ పురిపండా జయంతి



తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించిన మహానుభావులలో పురిపండా అప్పల స్వామి ప్రముఖులు. రచయితగా, పాత్రి కేయులుగా, పత్రికా నిర్వాహ కులుగా, రచయితల సంఘం అధ్యక్షులుగా, గ్రంథాలయ స్థాపకులుగా, గ్రాంథిక తెలుగు భాషా వాదిగా, బహుభాషా కోవిదులు గానే గాక, మహాత్మ గాంధీ నేతృత్వంలో చేపట్టిన స్వాతంత్ర్య ఉద్యమ కార్య క్రమాలలో జాతీయ వాదిగా క్రియా శీలక పాత్రలు పోషించారు.

పురిపండా అప్పలస్వామి (నవంబరు 13, 1904 – నవంబరు 18, 1982) విజయనగరం జిల్లా, సాలూరు గ్రామంలో నవంబరు 13, 1904 సంవత్సరంలో జన్మించారు. అక్కడే విద్యాభ్యాసం కొంతకాలం జరిపి, పిదప స్వయంకృషితో ఆంధ్ర, సంస్కృతాలలోనే గాక ఒరియా, హిందీ, బెంగాలీ, ఆంగ్ల భాషలలో పాండిత్యాన్ని ఆర్జించారు. మహాత్మాగాంధీ నిర్వహించిన సహాయ నిరాకర ణోద్యమం, హరిజనోద్యమం, ఖాదీ ప్రచారము లలో అత్యంత శ్రద్ధతో పాల్గొన్నారు. విశాఖపట్నంలో అఖిల భారత చరఖా సంఘం వారి ఖాదీ భాండాగారంలో నిర్వహకు డుగా కొంతకాలం పనిచేశారు.

పత్రికా రంగంలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. విశాఖ పట్నం నుండి వెలువడిన 'స్వశక్తి' అను జాతీయ వారపత్రికకు సహాయ సంపాదకుడుగా కొంత కాలం పనిచేశారు. 'ఆంధ్రపత్రిక' కు విలేఖరిగా వన్నెండేళ్ళు వ్యవహరించారు. 'సత్యవాణి' పత్రికను నిర్వహిస్తూ, ఆయన రాసిన సంపాదక వ్యాసాలు పునర్ముద్రణ గౌరవాన్ని పొందాయి. ఆయన ప్రచురించిన 'వైశాఖి' మాసపత్రిక సారస్వత ప్రియుల మన్ననలను పొందింది.

గ్రంథాలయోద్యమంలో ఆయన సాగించిన కృషి ప్రశంసనీయం. మంతెన ఆదినారాయణ స్వామి స్థాపించిన ఆంధ్రప్రదేశ్ ప్రథమ గ్రంథాలయాన్ని, 'కవితా సమితి' గ్రంథాలయాన్ని ఆయన అభివృద్ధి పరచారు. శ్రీరామవరం, పార్వతీ పురంల లోని గ్రంథాలయాలను పెంపొందించారు. మరకాం గ్రామాన ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ యావజ్జీవ గౌరవ సభ్యులుగా ఎన్నుకో బడినారు.

ఆయన సాహిత్య రంగంలో సాధించిన కృషి అనన్య సామాన్యం. 15 ఏళ్ళ ప్రాయంలోనే తెలుగులో గద్యపద్య రచనను శ్రీకారం చుట్టారు. 1928 వరకు ఆయన గ్రాంథిక భాషావాది. గిడుగు వెంకట రామమూర్తిని పరిచయంతో, ఆయనతో ప్రభావితుడై తన సాహిత్య కృషిని వ్యావహారిక భాషలోనే సాగించారు. కందపద్య మయమైన 'రాట్న పతాకం' ఆయన తొలి రచన. ప్రముఖ రచనలలో 'సౌదామిని' ఆంగ్లంలోకే కాక హిందీ, ఒరియా భాషలలోకి కూడా అనువదింపబడి పెక్కు ముద్రణలను పొందింది. కేంద్ర సాహిత్య అకాడమీ కోరికపై 'అమృత సంతానం', 'మట్టి మనుష్యులు' అనే ఒరియా నుండి తెనిగించారు. వంగసాహిత్య చరిత్ర, ఒరియా సాహిత్య చరిత్రలను తెలుగులో రచించారు. అలాగే ఆంధ్ర సాహిత్య చరిత్రను ఒరియా భాషలో రచించి తెలుగు సాహిత్యంతో పరిచయాన్ని ఒరియా పండితులకు కల్పించారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వ్యవహారిక భాషలో రచించుటకు పూనుకొన్న సంస్కృత భారతానువాదం శాస్త్రి మరణం వలన అసమగ్రంగా నిలిచిపోగా, మిగిలిన వదిహేను న్నర వర్వాలను రచించి పూర్తిచేశారు. రాట్న పతాకం; మహమ్మద్ చరిత్ర; సౌదామిని; ఒరియా పాటలు; జగద్గురు శంకరాచార్య; చైతిమాణ అరంగుర; విశ్వకళావీధి; హంగేరీ విప్లవం; దేవీ భాగవతం; పురిపండా భాగవతము; పురిపండా వ్యావహారికాంధ్ర మహాభారతం; శ్రీమద్భాగవతము; వ్యావహారి కాంధ్ర వాల్మీకి రామాయణం; అమృత సంతానం (అనువాదం); మట్టి మనుష్యులు (అనువాదం); వంగ సాహిత్య చరిత్ర; ఒడియా సాహిత్య చరిత్ర; భగవద్గీత తదితరాలు పురిపండా ప్రముఖ రచనలు.

ఆయన విశాఖ రచయితల సంఘానికి కొంతకాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర ప్రదేశ్ లలితకళా అకాడమి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలో కార్యవర్గ సంఘాలలో సభ్యత్వాలను పొందారు.

పురిపండా నవంబరు 18, 1982 సంవత్సరంలో పరమ పదించారు. ఆయనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ పురస్కారం ప్రదానం చేసింది.

ఆయన శతజయంతి ఉత్సవాలు విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించగా, ఆ సందర్భంగా ఆయన జీవితచరిత్ర, సాహిత్యం గురించిన ద్వా.నా.శాస్త్రి రచించిన పుస్తకం విడుదల చేశారు. పురిపండా విగ్రహాన్ని బీచ్ రోడ్డులో ప్రతిష్ఠించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఈ నెల 13-14 తేదీల్లో ప్రధానమంత్రి గుజరాత్.. కర్ణాటక పర్యటన

న్యూ ఢిల్లీ, నవంబర్ 12: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 13-14 తేదీలలో కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో పర్యటిస్తారు. ఇందులో భాగంగా బెంగళూరు నగరంలో ఉదయం 10:45 గంటల ప్రాంతంలో 'ప్రశాంతి కుటీరం' స్వర్ణోత్సవాలకు హాజరై, సభికులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12:45 గంటలకు మెట్రో రైలుకు పచ్చజెండా ఊపడంతోపాటు తావరకెరె నుంచి ఐఐఎం-బెంగళూరు మెట్రో స్టేషన్ వరకూ అందులో ప్రయాణిస్తారు. ఆ తర్వాత 1:15 గంటలకు బెంగళూరు నగరంలోనే ?15,600 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన.. దేశానికి అంకితం.. ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

అక్కడి నుంచి మైసూరు వెళ్లి, మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో 'కాస్మోస్-మైసూరు' ప్లానెటోరియంను ప్రారంభించిన తర్వాత సభికులనుద్దేశించి ప్రసంగిస్తారు.

ఇక నవంబరు 14వ తేదీన ప్రధానమంత్రి గుజరాత్ వెళ్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అక్కడి బనస్కాంతలో దేశంలోని 51 శక్తిపీఠాలలో ఒకటైన అంబాజీ ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ప్రధానమంత్రి తొలుత బెంగళూరు నగరంలోని 'స్వామి వివేకానంద యోగ అనుసంధాన సంస్థాన' (ఎస్-వివైఏఎస్ఏ) ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని 'ప్రశాంతి కుటీరం'లో నిర్వహించే స్వర్ణోత్సవాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ పరిపాలన భవనానికి శంకుస్థాపన సహా కేరళలోని తిరువనంతపురంలో 'ఎస్-వివైఏఎస్ఏ' కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

ఈ స్వర్ణోత్సవాలను 'వికసిత భారత్-2047' ఇతివృత్తంతో నవంబరు 13 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నారు. సంస్థ ఏర్పాటుతోపాటు సేవా రంగంలో దాని ఐదు దశాబ్దాల ప్రస్థానానికి ప్రతీకగా ఈ వేడుకలకు శ్రీకారం చుడుతున్నారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రాన్ని భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానంతో అనుసంధానించే లక్ష్యంతో 1975లో 'ప్రశాంతి కుటీరం' ఏర్పాటైంది. ఇక్కడి 'ఎస్-వివైఏఎస్ఏ'కి 2002లో విశ్వవిద్యాలయ హోదా లభించింది. ఈ సంస్థలో యోగ విద్య-పరిశోధనలు కొనసాగుతూంటాయి.

ఈ నేపథ్యంలోనే కాకుండా బెంగళూరుకు చెందిన ప్రముఖ ప్రబోధకుడు, రచయిత, నిర్వాహకుడైన శ్రీ హ్పంగసంద్ర వెంకటరామయ్య శేషాద్రి (1926) శతాబ్ది జయంతిని కూడా పురస్కరించుకుని ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆయన 1946లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో చేరి, 1987 నుంచి 2000 వరకు దాని 'సర్ కార్యవాహ్' (అధిపతి)గా పనిచేశారు. 'ఎన్-వివైఏఎన్ఏ' ఏర్పాటుకు కృషి చేసిన దార్శనికులలో ఆయన కూడా ఒకరు. ప్రశాంతి కుటీరాన్ని తీర్చిదిద్దడంలో, దశాబ్దాలుగా సంస్థ లక్ష్యాన్ని కొనసాగించడంలో శేషాద్రి స్ఫూర్తి, మార్గదర్శకత్వం, కీలక పాత్ర పోషించాయి.

ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి బెంగళూరులో ?15,600 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశానికి అంకితం, శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టులన్నీ పట్టణ రవాణా, విద్యుత్ ప్రసారం, పునరుత్పాదక ఇంధనం, పెట్రో మౌలిక సదుపాయాలు, వ్యర్థాల నిర్వహణ, రైల్వేలు సహా కీలక రంగాలకు సంబంధించినవే.

అలాగే, కాలెన అగ్రహారం-తావరకెరె మార్గంలో సుమారు ?3,470 కోట్లతో నిర్మించిన బెంగళూరు మెట్రో పింక్ లైన్‌ను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ కొత్త మార్గంతో పట్టణ రవాణా అనుసంధానం మెరుగుపడుతుంది. తద్వారా ప్రజలకు రోజువారీ ప్రయాణ సౌలభ్యంతోపాటు సమయం ఆదా కావడమేగాక బెంగళూరు నగరంలో ప్రజా రవాణా సౌకర్యం మరింత బలోపేతం అవుతుంది.

కొప్పల్-ఎఎ, గడగ్-ఎఎ లలో పునరుత్పాదక ఇంధన జోన్ల ఏకీకరణ (ఫేజ్-ఎఎ) కింద ?4,450 కోట్లతో నిర్మించిన విద్యుత్ ప్రసార వ్యవస్థను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. కర్ణాటకలోని కొప్పల్, గడగ్ ప్రాంతాల నుంచి సుమారు 2 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని గ్రిడ్ పరిధిలోని లబ్ధిదారులకు ప్రసార-పంపిణీ చేసేందుకు ఈ వ్యవస్థ వీలు కల్పిస్తుంది. దీంతోపాటు ?1,370 కోట్లతో బీదర్‌లోని సౌరశక్తి జోన్ కోసం ఏర్పాటు చేసిన ప్రసార వ్యవస్థను కూడా ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటయ్యే బీదర్ పూలింగ్ స్టేషన్ ద్వారా ఆ ప్రాంతం నుంచి 2.5 గిగావాట్ల సౌర విద్యుత్తును తరలిస్తారు.

దావణగేరే/చిత్రదుర్గ, బళ్లారి పునరుత్పాదక ఇంధన జోన్ల ఏకీకరణ కోసం ?3,450 కోట్లకు పైగా వ్యయంతో ఏర్పాటు చేసే ప్రసార వ్యవస్థ పథకానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. అంతేకాకుండా అదనపు పునరుత్పాదక ఇంధన సామర్థ్య అనుసంధానం కోసం 1,100 కోట్లకు పైగా వ్యయంతో దావణగేరె, బళ్లారిలో నిర్మించే ప్రసార వ్యవస్థ బలోపేత ప్రాజెక్టుకూ ఆయన శంకుస్థాపన చేస్తారు.

మంగళూరులో ?850 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన దేశంలోనే అతిపెద్ద ఎల్‌పీజీ భూగర్భ నిల్వ కేంద్రాన్ని ప్రధానమంత్రి దేశానికి అంకితం చేస్తారు. మొత్తం 80,000 టన్నుల నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ సదుపాయంతో దేశీయ ఎల్‌పీజీ నిల్వ మౌలిక సదుపాయాలు గణనీయంగా బలోపేతమవుతాయి. ఈ ప్రాజెక్టులో న్యూ మంగళూరు పోర్టును ప్రధాన టెర్మినల్‌తో అనుసంధానించే 9.4 కిలోమీటర్ల ఎల్‌పీజీ పైప్‌లైన్ కూడా అంతర్భాగంగా ఉంది. దీనితో ఎల్‌పీజీ సమర్థ రవాణా-నిల్వకు వీలు కలుగుతుంది. బెంగళూరులోని మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్) సంస్థ ?330 కోట్లతో నిర్మించిన దేవనగొంతి మార్కెటింగ్ టెర్మినల్‌ను కూడా ప్రధానమంత్రి దేశానికి అంకితం చేస్తారు. ఈ అత్యాధునిక కేంద్రం వల్ల కర్ణాటకలో పెట్రోలియం ఉత్పత్తుల నిల్వ-పంపిణీ మౌలిక సదుపాయాలు బలోపేతమవుతాయి.

బెంగళూరులోని హరలకుంటెలో గెయిల్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఇక్కడ నిత్యం 300 టన్నుల మున్సిపల్ ఘన వ్యర్థాలను శుద్ధి చేసి, 12.6 టన్నుల కాలుష్య రహిత కంప్రెస్డ్ బయోగ్యాస్‌నున ఉత్పత్తి చేస్తారు. శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించే ఈ ప్రాజెక్టు-సంప్రదాయ ఇంధనాల పరాధీనత తగ్గడమే కాకుండా పరిశుభ్ర, సుస్థిర పర్యావరణానికి దోహదపడుతుంది.

అమృత భారత్ స్టేషన్ పథకం కింద పునర్నవీకరించిన 4 రైల్వే స్టేషన్లు- చామరాజ నగర్, చిక్కమగళూరు, సకలేష్‌పూర్, సుబ్రహ్మణ్య రోడ్‌లను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ స్టేషన్ల పునర్నవీకరణతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు సమకూరుతాయి. అంతేకాకుండా ఇవి నగర కేంద్రాలుగా వర్ధిల్లుతూ ఈ ప్రాంతంలో స్థానిక వాణిజ్య కార్యకలాపాలను, పర్యాటకాన్ని ప్రోత్సహిస్తాయి.

గడగ్-హోట్టి మధ్య 284 కిలోమీటర్ల డబ్లింగ్ ప్రాజెక్టులో భాగమైన 45 కిలోమీటర్ల బాగల్‌కోట్-వాండల్ రైల్వే లైన్ డబ్లింగ్ విభాగాన్ని ప్రధానమంత్రి దేశానికి అంకితం చేస్తారు. దీనివల్ల ప్రయాణిక, సరకు రవాణా సదుపాయాలు మెరుగవుతాయి. స్థానిక వాణిజ్యానికి చేయూత లభించడంతోపాటు కుడ్లి ఎన్‌టీపీసీ ప్లాంటుకు బొగ్గు సరఫరా సౌలభ్యం కలుగుతుంది.

సకలేష్‌పూర్-సుబ్రహ్మణ్య రోడ్ ఘాట్‌లో 55 కిలోమీటర్ల రైలు మార్గం విద్యుదీకరణ పూర్తయిన నేపథ్యంలో ప్రధానమంత్రి దాన్ని దేశానికి అంకితం చేస్తారు. దేశంలోని అత్యంత దుర్గమ ప్రదేశాల్లో ఇదొకటి కాగా, దీనిగుండా నిర్మించిన ఈ రైలు మార్గాన్ని ఓ కీలక ఇంజనీరింగ్ విజయంగా అభివర్ణించవచ్చు. ఈ మార్గం అందుబాటులోకి రావడంతో బెంగళూరు-మంగళూరు మధ్య విద్యుదీకరణ 100 శాతం పూర్తయింది.

బెంగళూరు-మంగళూరు-మడ్గావ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ రైలుతో బెంగళూరు, కోస్తా కర్ణాటక, గోవా నగరాల మధ్య వేగవంతమైన, ఆధునిక రైల్వే అనుసంధానం కలుగుతుంది. ఈ రైలు హాసన్, సకలేష్‌పూర్, మంగళూరు, ఉడుపి, మురుడేశ్వర్, గోకర్ణ, కార్వార్ వంటి కీలక ప్రాంతాల మీదుగా తుది గమ్యమైన మడ్గావ్ చేరుతుంది. దీనివల్ల ఆయా ప్రాంతాల ప్రయాణికులకు ప్రయోజనం చేకూరడం సహా ఈ ప్రాంతంలో పర్యాటకానికి మరింత ఊతం లభిస్తుంది.

దేశంలో ప్లానెటేరియం సాంకేతికత, ఖగోళ శాస్త్ర విద్యలో కీలక ప్రగతికి ప్రతీకగా కాస్మోస్-మైసూరు ప్లానెటేరియంను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) నిర్మించిన వేదశాల దేశంలో తొలి ఎల్ఈడీ డోమ్ ప్లానెటేరియం. ఖగోళశాస్త్ర విద్యా-శిక్షణ కేంద్రంగా దీన్ని చాముండి పర్వత ప్రాంతం వద్ద మైసూరు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్మించారు.

ఈ అత్యాధునిక ప్లానెటేరియంలో 4.2 కోట్ల ఎల్ఈడీలతో సుమారు 6,150 ప్యానెళ్లున్న 15 మీటర్ల డోమ్ ఉంటుంది. చిత్రాల ప్రదర్శన కోసం ప్రొజెక్టర్లను ఉపయోగించే సాంప్రదాయ ప్లానెటేరియంల తరహాలో కాకుండా దీని ఎల్ఈడీ ప్యానెళ్లను ప్రత్యక్షంగా నియంత్రించవచ్చు.

కరీంనగర్ మహా పాదయాత్రకు బీజేపీ శ్రేణుల సమాయత్తం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రకు సంబంధించి జన సమీకరణ, పార్టీ శ్రేణుల భాగస్వామ్యంపై సమావేశంలో చర్చించారు. పాదయాత్రను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మహా పాదయాత్రకు పెద్దఎత్తున జన సమీకరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, గుండె కార్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు తిప్పరవేణి వేణి రాజు, ఎరుగొక్కుల రమేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గొనె భాస్కర్, జిల్లా కార్యదర్శి చల్ల నరసయ్య, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కంసాని రాము, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డవేని రాజు, ఉపసర్పంచ్ సిలువేణి ప్రశాంత్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి పెరంగని మల్లేశం, మండల కార్యదర్శి సంజీవ్ రెడ్డి, బూత్ అధ్యక్షులు గాండ్ల తిరుపతి, బడుగు అంజి, పడిగేల బాబు, పల్లెబోయిన నాగరాజు, అవుధూత అఖిలేష్‌తో పాటు నాయకులు కొమిరె అంజన్న, జింక శేఖర్, ముడికే శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, మరిపెద్ది వికాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంబంధిత మెడికల్ సూపరింటెండెంట్లకు వినతిపత్రాలు అందజేశారు. కార్మికుల వేతనాలు పెంచాలని, చట్ట ప్రకారం పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు కల్పించాలని కోరారు. ప్రతి సంవత్సరం బోనస్ చెల్లించడంతో పాటు ప్రతి కార్మికుడికి రెండు జతల యూనిఫారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. నెలవారీ వేతనాలను ప్రతి నెల ఒకటో తేదీన చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సొమ్మును కార్మికుల ఖాతాల్లో సక్రమంగా జమ చేయాలని కోరారు. కార్మికుల హక్కులను కాపాడుతూ వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నాయకులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, బండారి హరీష్, మారవేని మహేష్, సూపర్‌వైజర్ నాగరాజు, ఉదయ్, పద్మ, రవి, సుమలత, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ నివాసానికి కేంద్ర మంత్రి బండి సంజయ్

లక్ష్మణ్ మాతృమూర్తి లస్మవ్వకు నివాళి అర్పించిన కేంద్ర మంత్రి



కరీంనగర్, నవంబర్ 12: (నేటినిజం ప్రతినిధి) కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం హుస్నాబాద్ లోని కరీంనగర్ నగరం ఈనాడు సీనియర్ జర్నలిస్ట్ కొండా లక్ష్మణ్ నివాసానికి వెళ్లారు. కొండా లక్ష్మణ్ మాతృమూర్తి కొండా లక్ష్మీ(లస్మవ్వ) ఈనెల 10న మరణించారు. ఈ నేపథ్యంలో లస్మవ్వ చిత్రపటానికి కేంద్ర మంత్రి నివాళి అర్పించారు. కొండా లక్ష్మణ్ ను పరామర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు స్థానిక బీజేపీ నేతలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కొండా లక్ష్మణ్ ను పరామర్శించారు.

పాఠశాల పక్కనే మురికి కూపం..

మురుగు నీటి నిల్వలు.. పందుల స్వైరవిహారం. దోమలు, ఈగలతో విద్యార్థుల అవస్థలు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని 11వ వార్డులో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉర్దూ మీడియం పాఠశాల పక్కనే మురుగు నీరు నిల్వ ఉండటంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీనికి తోడు పందులు స్వైరవిహారం చేస్తుండటంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీటి నిల్వలతో దోమలు, ఈగల బెడద పెరుగుతోందని, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాల పక్కనే ఇలాంటి దుర్భర పరిస్థితులు నెలకొనడం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. విద్యాసంస్థల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి మురుగు నీటిని తొలగించాలని, కాలువలను శుభ్రం చేయడంతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టి పందుల సంచారాన్ని నియంత్రించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

దుబాయ్‌లో 23 నుంచి బిగ్ 5 గ్లోబల్ ప్రదర్శన



హైదరాబాద్, నవంబర్ 12: నిర్మాణ రంగంలో ఆధునిక సాంకేతికతలు, వినూత్న ఉత్పత్తులు, సుస్థిర పరిష్కారాలను పరిచయం చేసేందుకు ఈ నెల 23 నుంచి 26 వరకు దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో 'బిగ్ 5 గ్లోబల్?2026' ప్రదర్శన నిర్వహించనున్నారు. మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లో విస్తరిస్తున్న నిర్మాణ రంగానికి భారత తయారీ సంస్థల సామర్థ్యాలను పరిచయం చేయడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశం. ఇందులో 60కి పైగా దేశాల నుంచి 1,800కు పైగా సంస్థలు పాల్గొని 55 వేల ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాయి. ప్రదర్శనలో పాల్గొనే సంస్థల్లో 70 శాతానికి పైగా అంతర్జాతీయ సంస్థలే కావడం విశేషం.

ఈ సందర్భంగా ఇంజినీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఇండియా చైర్మన్ పంకజ్ చద్దా మాట్లాడుతూ.. భారత్, యూఏఈ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని తెలిపారు. నిర్మాణ రంగంలో భారత కంపెనీలకు అంతర్జాతీయ వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయన్నారు.

ఈ ప్రదర్శనలో భారత్ నుంచి 80 కంపెనీలు పాల్గొం టున్నాయని వెల్లడించారు. ఆక్వాసబ్ ఇంజినీరింగ్, సీఆర్ఐ పంప్స్, ఆస్ట్రాల్, హిమాలయన్ అడెసివ్స్ తదితర సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయని చెప్పా రు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.